సుధా సాహిత్య మండలి నూజివీడు, కృష్ణాజిల్లా.

మండలి పక్షమున	సర్వాధికారములు
ప్రకటింపఁబడిన	మండలికి
మొదటి పుస్తకము.	చెందఁజేయఁబడినవి.

ప్రకరణ పరిచయము.

ఒక్క మాట.

గాంధి, మహాత్ముఁడు. వారియాత్మ యింతదని యట్టిట్టిదని నిర్ణయించి వర్ణించుట యసాధ్యము. అట్టి యాత్మ మన మహర్షుల కుండెడిది, తరువాత వచ్చిన శంకరాదుల ధోరణివేఱు. వీరి యాత్మతీరు వేఱు. ఇట్టి యాత్మ కడపట బుద్ధభగవానునకే గలదు.

ఈ యుపోద్ఘాతము ఇంతకన్న విరళించుటకంటె క్షేమము మహాత్ముని తొలి సత్యాగ్రహవేళ వారిపై విరచించిన కీర్తన నిందుఁ బొందు పరచుట మంచిది.

(ఘణితి “ఎంతమాటాడితివమ్మా” వలె ;

ప॥ సత్యవ్రతుఁడు కృతకృత్యుఁడు - నా
పత్య మెందునులేని సత్యాగ్రహుఁడు గాంధి।
సత్యమే జయమంచు - నిత్యము బోధించి।
సత్య స్వరూప సాం - గత్యము గావించు॥ స॥

౧. “దుర్మార్గ తిమిరాపహారుఁడు - స
త్కర్మ యోగజనిత నిర్మల యశుఁడు
మర్మమెందని సామ్య వర్మము ధరియించి
నిర్మల మనముతో కర్మల నొనరుచు॥ స॥

౨. “హింసాగతైశ్వర్య మెందుకు - దు
ర్మాంస జనిత సౌఖ్య మరణమెందుకు
హింసించ కితరుల హింసించుకొనుము, య
హింసయే, ధర్మము - సంసారిక యను” స॥

3 మతభేద మన మార్గ భేదము - సం
గతి తెలియలేని దు - ర్మతియ భేదము
క్షితిని సోహమని మతి దెలిసి వర్తించు
సతిమంతునకు సర్వ - గతులు గల్గునను ॥ స ॥


ఈ పీఠికను వ్రాయుటకు గ్రంథకర్తకు మాపైఁగల యనురాగము గారవమునకన్న మాకు వేఱొకయధికారము లేదు. వీరు మాకు చిరపరిచితులు, కేవల సోదర ప్రాయులు, వీరికి ప్రశంసను గూర్చుటకు అధికారము మొదు. మేమెఱింగి నప్పటినుండి వీరిని స్థానిక గాంధి యనివాడుచుంటిమి. అంతకన్న వీరింగూర్చి మేము వ్రాయుట యనవసరము. ఇంతమాత్రము వ్రాయుటగూడ వారి కయిష్టమని మేమెఱుంగుదుము.

దీనిలో కొంత భాగము మేము వింటిమి. శైలి మృదు మధురమని మేము వ్రాయనక్కఱలేదు. భావములు అద్దము నంబలె దెల్లముగఁ బ్రకటితములని నొక్కి వక్కాణింపఁగలము.

ఆంధ్ర ప్రపంచము ఈ చిన్ని పొత్తము నాదరించి, యీ వ్యక్తికిఁదగిన యుత్సాహము నొసఁగూర్చి, యిట్టి గ్రంథముల నింకనుగూర్చు నుద్రేకమును వీరికి గల్గించునని నమ్ముచు విరమించుచున్నాము.

నూజివీడు,
29—1—46.

వారణాసి శ్రీనివాసరావు,
ఎం. ఏ. (ఆనర్సు) ఎల్. టి.



ఓమ్

భక్తో జయతు.

లోకోత్తరుఁడు

మొదటి ప్రకరణము

మేటి మహానుఁడు.

శ్రీరామకృష్ణ పరమహంస జ్ఞాని. అరవిందుఁడు యోగి. రామమోహనుఁడు సంస్కర్త. గౌతమబుద్ధుఁడు దీనదయాపరుఁడు. పోతన్న భక్తుఁడు. వివేకానందుఁడు కర్మయోగి. కృష్ణరాయలు చక్రవర్తి. తిమ్మరుసు మహామంత్రి. జీసను త్యాగి. మహమ్మదు యోధుఁడు. ఆదిశంకరుఁడాచార్యుఁడు. కాని ఇంతటి లక్షణములన్నియు ఒకనికే పుష్కలమున్న మహాపురుషుఁడు,

లోకములోని కొండలన్నింటికన్నను మేరువు మిక్కిలి గొప్పదయినదని చెప్పుదురు. హిమవంతము, గంధమాదనము, ఉదయాచలము, అస్తాచలము, ఇవేవియు దానితో సాటిగావు. అది బంగారుకొండ. దేవతలందు నివసింతురు. అది రతనాలగని. జగములను వెలిగించు సూర్యచంద్రాదులును దానిచుట్టు తిరుగుచుందురు. దాని తేజము నెవ్వరు నాపలేరు. గాంధి ఆ మేరువు వంటివాఁడు.

అబుల్ కలామ్ ఆజాద్, జవహర్లాల్, వల్లభాయ్ పటేల్ ప్రకాశమ్, పట్టాభి, రాజేంద్ర ప్రసాద్, అబ్దుల్ గఫార్ ఖాన్ భూలాభాయి దేశాయ్, వీరు దిగ్గజములు. లోకములను తమ భుజములపై మోయఁగలిగినవారు. చదువులయందు బృహస్పతిని, బ్రహ్మను సయితము మెచ్చనివారు. దేవేంద్ర పదవిని కడఁగంటితో నైన చూడనివారు. ఘనశ్యామదాసు బిర్లా, కమలపతియును బజాజ్ కుబేరుని లెక్కసేయనివారు. భన్సాలీ, సీతారామశాస్త్రి ఋషులను గణింపనివారు. సరోజని, మీరా, దేవకాంతలను కాదనువారు. ఇట్టి పండితులు, ఇట్టి యోధులు, ఇట్టి ధనవంతులు, ఇట్టి ఋషులు, ఇట్టి విద్యావతులు, గాంధిచుట్టు గుడిగట్టి తిరుగుచుందురు. అతని పాదములకడఁ గూరుచుండి ఉపదేశములఁ గొనుచుందురు. అతని చిఱునవ్వు వెన్నెలలఁ దేలి యాడుచుందురు.

ఇక్కడ వీరపూజ యెట్లుండెనో ఇంగ్లాండులో నతనికిఁగల గౌరవముగూర్చి విచారింతము. అవి రౌండు టేబిలు సభ జరగిన దినములు. లండను నగరములోని గిల్డుహాలు భవనములో నొక నాఁడు గాంధి యుపన్యాసమునకై మహాసభ జరిగినది. ఆ వచ్చిన జనమునకు పరిమితి లేదు. సరే; ఉపన్యాసము జరగినది. మహాత్ముఁడు సభాభవనము విడిచి వెలుపలకు వచ్చినాఁడు. ఆతని వెంట రాయిడను కన్య యుండెను. ఆమెయే యాతనిని మొదట తన మోటరు బండిలో సభకు తీసికొని వచ్చినది. సభ కైన వెనుకను, ఆతని బసకు తీసికొని పోవలెనని ఆమె తన బండి కొఱకై వెదకులాడెను. ఆ జనములో నది కానరాదయ్యె. అది రాత్రి సమయము. మంచు కురియుచుండెను. మహాత్ముని అంగవస్త్రము. చలిచే నతఁడు గడగడలాడు చుండెను.

అంత రాయిడను కన్య, అయ్యో! నాబండి కనఁబడక పోయెనే యని తల్లడిల్లినది. ఆసమయమున మహాత్మునిచుట్టు మోటారుబండ్లు రోకలిబండలవలె నెమ్మదిగా తిరుగుచుండెను. మహాత్ముఁడు నామోటరులో నెక్కిన బాగు. నామోటరులో నెక్కిన బాగు, అని ప్రతి మోటరు యజమానుఁడును తలఁచు చుండెను. ఇంతలో రాయిడనుకన్య, మహాత్మునితో, అయ్యో! నాబండి కనఁబడకపోయెనే. మఱియొక బండిలో పోవుదమా యనెను. అంతట మహాత్ముఁడామెతో, అమ్మా! తొందరలేదు. నీబండినే రానిమ్మనెను. ఆమాటలు విని ఆమె కిరీటము తలఁ

దాల్చినట్లు మెరిసిపోయినది. నేనెంత ప్రశ్నము చేసికొంటినో అతని యామె పొంగిపోయినది. అవ తరమామె బండివచ్చినది. దానిలోనెక్కి వారు వెడలిపోయిరి.

లండనులోనే మఱియొకనాఁడు మహాత్ముఁడు తన గదిలో యుంటు ధ్యానములో మునిఁగియుండెను. చెలికాండ్రు చుట్టునుఁ గలిసియుండిరి. ఇంతలో తలవాకిట నొకపడుచువచ్చి నిలిచి యున్నదనియు ఆమె వానలో తడిసి వణకుచుండుటచే దర్శనమునకై తహతహపడుచున్నదనియు వార్త వచ్చినది. ఆమాటలు విని మహాత్ముఁడు జాలిగొని ఆమెను వెంటనే లోనికి రానిండనెను. ఆమె వచ్చి గాంధీకి వందన మొనరించి కూరుచుండెను. ఆమె యెవ్వరో యెఱుఁగుదురా? ఇటలీదేశపు రాజకుమారి.

ఈ తీరున స్వదేశమందున్నను, విదేశమందున్నను, రాజాధి రాజులును, కిరీటాధిపతులును, మహాత్ముని చూచిన చాలును, పలుకరించిన చాలును, అని పొంగి పోవుచుందురు.

ఇట్లాతఁడు సాటిలేని తేజము గలవాఁడై మహోన్నతుఁడై గోచరించుచున్నాఁడు.

"సర్వాతిరిక్తసారేణ, సర్వతేజోభిభావినా
స్థితస్సర్వోన్నతేనోర్వీం, క్రాన్త్వా మేరురివాత్మనా.

అన్నిటిని మించిన బలము, అన్నిటిని మించిన తేజము అన్నిటిని మించిన ప్రాజ్ఞ గల దేహముచేత అతడు భూమి నాక్రమించి మేరువువలె ఉండెను. అని మహాకవి కాళిదాసు దిలీపునిపట్ల చెప్పిన మాటలు, నేడు గాంధిని గురించి ప్రతి అక్షరమును సరిపోవును.

రెండవ ప్రకరణము

ఆ శ్రేష్ఠ గూఢ పుస్తకం.

ఒక మహారాజు గలడు. అతని కొక కుమారి యున్నది. ఆమె కతడు పెండ్లి సేయనెంచెను. వివాహమునకు ముందు కల్యాణ మంటపము నలంకరింపదలచి, అతడు చిత్రకారులను పిలిపించి రెండు గోడలపైన చిత్రములు వ్రాయుడని యానతిచ్చెను. ఆ గోడలు ఒకదాని కొకటి యెదురుగా నున్నవి. వానిపైన తెరలు వేసికొని ఆ యిరువురు చిత్రకారులు చిత్రములు వ్రాయుచుండిరి. ఎవని చిత్రములు ముద్దులు గులుకుచుండునో వానికే విలువగల గానుకల నొసంగెదనని మహారాజు పలికి యుండెను.

చిత్రకారులు కష్టించి తెరల లోపల నేమేమో పనులు చేసిరి. అంత చిత్రముల పరీక్షాదినము వచ్చినది. మహారాజు బంధువులతో వచ్చి ఒక గోడపై గల తెరను తీయించెను

అందలి చిత్రపటములు జీవకళతో నుట్టిపడుచుండెను. అద్దిర! బొమ్మలన్న నిటులుండ వలెనని అందఱు నబ్బురపడి ఈ చిత్రకారునకే మొదటి కానుక నొసఁగిరి. పిదప రెండవ గోడపైఁగల తెఱను దీసివేసిరి. ఔరా! ఏమాశ్చర్యమిది! ఈ బొమ్మలు, ఆబొమ్మలు ఒక్కటియే. కాని మొదటి గోడ చిత్రపటములకంటె, ఇవి క్రొంగ్రొత్త కాంతి, వికాసము గలిగి నిగనిగలాడుచున్నవి. వీనిని చూచి చూపఱులు పరమాశ్చర్యమును పొంది ఈ చిత్రకారుఁడే మేటిపనివాఁడు. ఈతని చిత్రములే సర్వోత్తమములు. ఈతనికే మొదటి కట్నము రావలెననిరి.

మహారాజా రెండవ చిత్రకారుని పనితనము మెచ్చుకొని ఆతనికి విలువలేని నగలిచ్చెను. ఇంతకును, ఆతని పనితనమేమి. ఆతఁడింతకాలమువఱకు తన గోడమీఁద బొమ్మలు వ్రాయలేదు. కాని నద్దమువలె నునుపుచేసెను. కనుకనే ప్రతివస్తువందు ప్రతిఫలించుచుండెను. మొదటి గోడపైఁగల చిత్రపటములన్నియు రెండవగోడపై ప్రతిబింబించుటకుఁగల హేతువద్ది.

గాంధి తేజమునకు కారణమిదియే. ఆతఁడు తన మనస్సును నిర్మలము గావించుకొన్నాఁడు. కామాది వికారములను కడిగి వేసికొన్నాఁడు. కోపము అసూయ, గర్వము, విరోధము మున్నగు దుర్గుణములను మొదలంట పెకలించి వేసినాఁడు.

నేఁడాతని డెందము మానస సరోవరమువలె విశుద్ధమై వెలుఁగొందు చున్నది. అందీశ్వర తేజము ప్రతిబింబించు చున్నది. అందు దేవరహస్యములు తెలియ వచ్చుచున్నవి. కనుక నే గాంధి పలుకు దేవవాణి యని, గాంధిరూపము దేవరూపమని యాతని భక్తులు వినుతి సేయుచుందురు. దేవవాణి దేవరూపము లన సత్యవాణి సత్యరూపములనుటయే.

ఇఁక నాతని రూపమెట్టిదో తెలిసికొందము. ఒక సముద్రపుటొడ్డున నొక తీతువుజంట నివాసము చేయుచుండెను. అందు పెంటిపిట్ట తనమగనిఁ జూచి, వింటిరా. నాకు నీరాడు సమయము సమీపించినది. ఈసముద్రుఁడు మనకుఁ బగవాఁడు గదా. ఇతఁడు తన ఉత్తుంగ తరంగములచే మున్ను నాకాన్పుల నెన్నిఁటినో పొట్టను బెట్టుకొన్నాఁడు. ఎన్నాళ్లీ యగచాట్లు. పదండి పోదము వేఱొక తావున కనెను. అంతట మగపిట్ట నవ్వి వెఱ్ఱిదానా! ఈసాగరునకు నేను భయపడుదునా. చూడు నా దెబ్బ యని ఆఁడుపిట్ట నూరార్చి, తాను సముద్రపునీట ముక్కుఁదడిపికొని, ఇసుక తిన్నెలఁ బొరలించి, సముద్రమున నాయిసుక రేణువుల విదిర్చుచుండెను. ఇంతలో నాదారిని నారదుఁడు పోవుచుండెను. ఆతఁడా తీతువును జూచి, ఓయీ విహంగపుంగవా! నీవేమొనర్చుచున్నావే మనెను. అది యాతనిఁగని,

స్వామీ! సముద్రమును పుక్కిట వేయుచున్నాననెను. ఆమాటవిని నారదుడు పక్కున నవ్వి, ఓయీ! ఎవరయినను విని నవ్వెదరా. ఏటిమాటలివి. ఏటి సాహసమిది. లొడితెడు పిట్టవు. సముద్రము నింకింపజూచుచున్నావా. చాలుచాలు, నీయుద్యోగమనెను. ఆమాటలు వింటివా, డోరా! నీకు దండము పెట్టెద వినుము. నారూపము లొడితెడుగాదు. బ్రహ్మాండ భాండములను బంతులవలె నాడింపగ గలిగినది నారూపము. సూర్య చంద్రాదుల వెలిగింపగలిగినది నారూపము. సచ్చిదానందమైనది నారూపము. అప్రమేయమయినది నారూపము. ఆయాత్మరూపము ముందీ సముద్రమేపాటి యనెను. ఆపలుకులు విని నారదుడు దాని ధైర్యమునకు సంతసించి వెడలిపోయెను.

గాంధి రూపమట్టిది. అతడాత్మరూపము నెరిగినవాడు. ఆత్మ శక్తి దర్శించినవాడు. అది ఆకాశమంత విశాలమయినది. అందు సూర్య చంద్రులు వెలుగొందుచుందురు. చుక్కలు మిణుకు మిణుకు మనుచుండును. మిక్కిలి పొడవుగల కొండ కొమ్ములును అల్లకల్లోలముగా నుండు సముద్రములును, భీకర జంతువులతో నిండిన కట్టడపుటడవులును, ఆ యాకసము క్రింద నడంగి పడి యుండును. ఇంతియకాదు, అందు సర్వశక్తులును నిండియుండును. దాని నందుకొనువాడింతకు పుట్టలేదు. కనుకనే జర్మనీ, జపాను ఇటలీ సామ్రాజ్యముల కుంభములు పగుల గొట్టి రక్తము త్రాని

త్రేచిన బ్రిటను సింగముతో చెలగాటలాడుట కొక్క గాంధికే చెల్లినది. అతని యాత్మతేజము ముందు సింగము లేమిలెక్క.

మూడవ ప్రకరణము

గాంధి తేజమునకు కారకులు

ఆమె రాజకోట దివాను భార్య. పేరు పుతలీబాయి. ఆమె తన మగనికి నాలవ పెండిలి యిల్లాలు. అతఁడప్పుడు వృద్ధుఁడు ముదుసలి. కాని యీమె పదేఁడ్ల పడుచు. అయినను సుకన్య చ్యవన మహామునినట్లు మగనిని ప్రీతితో పూజించినది. ఏనిముసమైనను ఆమె పతిసేవ విడనాడియుండలేదు ఆమె నిత్యము అరుణోదయమునకు పూర్వము హరినామస్మరణము చేయుచు మేల్కాంచి స్నానము గావించుకొని, మడిబట్టగట్టి, చేరెడు పసుపు కుంకుమ పెట్టుకొని, పాపట చెందిరపుబొట్టు సలంకరించుకొని, తులసిపూజ చేసికొని, పూలసజ్జ నింపుకొని, దేవమందిరమునకుఁ బోయి దేవుని పూజించి, ప్రసాదము నివేదించి యింటికి మరలి వచ్చుచుండెడిది. భారత, భాగవత రామాయణములను భక్తితో వినుచుఁ గన్నుల నీరు తెచ్చుకొనుచుండెడిది. ఆమె తన జీవితమంతయు ఈశ్వర కైంకర్యమునందే వినియోగించెడిది. ఆ దేవప్రీతికై ఆమె నిత్యము వ్రతములు, నోములు చేయుచుండెడిది. ఆమె ఎన్నడును

కల్లలాడి యుండలేదు కలహములకు దిగియుండలేదు. లౌకిక వాంఛలు కలిగియుండలేదు. సౌజన్యము విడిచియుండలేదు. ఈశ్వర భజనము మానియుండలేదు. ఆమె అరుంధతియో అనసూయయో యనునట్లుండెను. అట్టి సతీ శిరోమణియగు పుతలీబాయికి ఈ మోహనదాసు కరంచందు గాంధి ఉదయించి యున్నాఁడు. కావున నే యతనియందు ఆ భక్తి, ఆ శ్రద్ధ, ఆ ప్రేమత ఆ వైరాగ్యము, ఆ ఈశ్వరచింత, ఆ పరమార్థదృష్టి, కల్పలతవలెఁ గాచిన పండ్లవలె వికాసము నొందియున్నవి. ఈ కళ్యాణ గుణములచే వెలుఁగొందుచున్న ఈ నాటి గాంధి తేజమును కన్నది పుతలీబాయి. ఆమెయే ఆ తేజమునకు [illegible].

ఇక నా తేజమును పెంపుచేసిన రెండవవారిని గుఱించి వినుము. ఈనాఁడు గాంధికి గల చొరవ సింగమునకు లేదు. కాని చిన్నతనమున నతఁడు నట్టి పిఱికివాఁడు. అతనికి చీకటిఁజూచిన భయము. తేలును జూచిన భయము. అతనికి పదమూఁడవ యేటనే పెండ్లి యైనది గనుక సతితో కాపురము కూడ చేయుచుండెను. కాని యాతనికి రాత్రిపూట దోడుపోవుచుండెడిది.

ఆ నాఁడు వారి యింట రంభ యను దాసి యుండెడిది. ఒక దినమున ఆమె చిన్నగాంధిని జూచి, నాయనా! ఏల ఇంత భయమొందుచుండువు. ఒక్కమాట చెప్పెద వినుము. నీకు భయముగలిగినప్పుడెల్లను రామ నామము స్మరింప భయమంతయు నశి

ఆ పలుకాతనికి శ్రీ రామ మంత్రోపదేశ మయ్యెను. అది ఆతని చేత మనమున గట్టిగా హత్తుకొని పోయెను. నాటి నుండి నేటి వఱకు నేను రామ నామమును విడువలేదని యాతఁడు చెప్పుకొనుచున్నాఁడు. కోతులను, పాములను, బోయలను తరింపఁ జేసిన రామనామ మాతనిఁ గాపాడుచున్నది. నాఁటి ఆ రంభోపదేశ ఫలితమును అతఁడు పొందుచున్నాఁడు.

ఇఁక మోహనదాసు గారి చిననాఁటి ముచ్చటలనుఁ గలిగిన కొన్ని విషయములు తెలిసికొందము. ఒక నాఁడతఁడొక పుస్తకము చదివినాఁడు. దాని పేరు శ్రవణ పితృ భక్తి అందు శ్రవణుఁడను మునికుమారుఁడు కనులు లేని తన తలిదండ్రులను కావడిలో కూర్చుండఁబెట్టుకొని తిరుగుచుండుట చదివెను. అది యాతని కెంతయు రుచించెను. తల్లిదండ్రుల సేవయను ధర్మోపదేశమాతఁడీ తీరున పొందెను.

మఱియొక నాఁడతఁడు హరిశ్చంద్ర నాటకము చదివెను. కొందరు భాగవతులా నాటకమాడుచుండఁగా గూడ నతఁడు చూచెను. దానిని చూచి యాతఁడు తనివితీఱ నానందించెను. నేను గూడ హరిశ్చంద్రుని వలె నేల సత్యవ్రతపరుఁడను కారాదని అతఁడు తలంచెను. ఈ తీరున నతఁడు చిన్నతనముననే సత్యోపదేశమును పొందెను.

కొంచెము పెద్ద వాడయిన పిదప అనఁగా పదునైదు వత్సరముల ప్రాయము వచ్చినప్పటికి, గాంధి చెడ్డపిల్లల సావాసమునఁబడి, ద్రోహచింతనముచేయుట, అసత్యమాడుట, మున్నగు తప్పిదములు చేసెను. కాని యంతఃకరణము వెంటనే తన పాప బుద్ధిని మరలించుకొనెను. దానికి కారణ మాతని ధర్మ సంస్కారములు బలముగా నుండుటయే, వానికితోడు తనతండ్రి దయాగుణమాతని వేయి విధములఁగాపాడెను. ఆసమయమున నతని తండ్రి కరంచంద్ గాంధి భగందర వ్యాధిచే మంచము పట్టి యుండెను. అత్తటి, బాలుఁడైన మోహనదాసు గాంధి తాను చేసిన తప్పుల కొన్నిటినొక కాగితముపై వ్రాసికొని, తండ్రిచేతి కందించి తాను గజగజలాడుచు నాతని కట్టెదుర నిలువఁబడి యుండెను. అతఁడాయుత్తరములో, నేను తప్పులు చేసియుంటిని ఇక ముందిట్టివి చేయబోవనని ప్రమాణము చేయుచున్నాను. తన్ను నూరు విధముల మన్నించి కరుణింపవలసినది. నాతప్పులకు నాకు కఠిన శిక్ష విధింపవచ్చును. నామూలమున మీరెట్టి కష్టము పడవలదని వేడుకొనుచు వ్రాసికొని యుండెను. అది చదివికొని కరంచంద్ కన్నుల నెగచి, తన బాలుని సత్యప్రియత్వమునకు చాల సంతసించి, ముత్తెములవంటి ప్రేమ బాష్పములచే నా యుత్తరము తడిపి, దానిని చింపి పారవేసెను. అదియే నా జీవితమునకు మొదటిపాఠము. పెద్ద గుణములకు ప్రేమయే మూలన

జయించవలెను ఇట్టి నాతని శ్రీపాదములకడ నేను నేర్చుకొంటి నని యీనాడు గాంధి చాటుచున్నాడు. ఈతీరున సత్యము అహింసా ధర్మోపదేశము తన తండ్రినుండి పొందెను.

ఇక నాతని తేజమునకు కారకుడైన మూడవ వాని గురించి విందము. గాంధికి ఇరువది వత్సరములు వచ్చినవి. అతడు ఇంగ్లాండులో చదువు పూర్తి చేసికొని బొంబాయి వచ్చి యుండెను. అతడచ్చోట రాయచందుభాయి దర్శనముచేసికొని యుండెను ఈ రాయచందుభాయి గొప్ప రతనాల వర్తకుడు. లక్షల రూకలమీద వ్యాపారము చేయుచుండెను. కాని అతని మనము శ్రీహరి పాదములచెంత విహారము చేయుచుండెను. రాజర్షియగు అంబరీషునివలె అతడు తన మనోనేత్రములతో నారాయణుని దర్శించుచు సర్వకర్మములు నాతని కర్పణగావించి తామరాకుపై నీటిబిందువువలె జీవయాత్ర గడపుచుండెను. అతని ప్రాయ మప్పటికి ఇరువది యేండ్లు అయినను ఎఱుకలో నతడు ముదుసలి. కాంతిమంతుడు. అతడు తన వ్యాపారమున తీరికగల నిముసముల వేదాంత గ్రంథములఁబఠించుచు తత్త్వ విచారముచేయుచు ఈశ్వరధ్యానము చేసికొనుచుండువాడు. అట్టి సజ్జనుని సాంగత్యము గాంధి కబ్బినది. గాంధి యాతని చెంతఁ గూరుచుండి వేదాంత చర్చ గావించుచు వేదాంతోపదేశము పొందుచు నుండువాడు.

ఇంతియగాక కొన్ని మేలిపొత్తములు గాంధి యుత్తమ జీవితమునకు, ఆత్మవిచారమునకు తోడుపడినవి. అందు మొదటిది తులసీరామాయణము. అది యాతని రామభక్తధురంధరునిగఁ జేసివేసినది. రెండవది టాలుస్టాయి వ్రాసిన ఈశ్వరసామ్రాజ్యము నీలోననే యున్నదను గ్రంథమును మూడవది రస్కిను వ్రాసిన సర్వోదయమను పొత్తమును [illegible] కాతనికి మిక్కిలి సాయము చేసినవి. [illegible] భగవద్గీతయన్ననో అతనికి అధ్యాత్మదీపమే యయ్యెను. అతఁడు సత్కర్మములు దాని వెలుఁగుననే గావించుచుండును. అందలి విశ్వరూప సందర్శనము గావించుకొనుచు అతఁడు ధ్యానము నందు మునిఁగిపోవుచుండును.

గాంధి జీవితము భగవద్గీతకు భాష్యము. సమస్త ధర్మములు విడిచి నన్నే శరణు పొందుము. నేను సమస్త పాపముల నుండి రక్షించెదను. విచారింపకుము అని శ్రీకృష్ణదేవుఁడు అర్జునునితోఁ బలికియున్నాఁడు. ఆ భగవానుని పలుకులు పాటించి గాంధి తన్ను ఈశ్వరార్పణ గావించుకొన్నాఁడు. దుఃఖములు కలిగినపుడు విచారింపరాదు. సుఖములు కలిగినప్పుడు విఱ్ఱవీఁగరాదు. వస్తువులయందు కోరికగాని ద్వేషము గాని ఉంచరాదు. నిశ్చలుఁడు వర్తించునో యాతఁడు స్థితప్రజ్ఞుఁడని గీతలో చెప్పఁబడినది. అట్టి స్థితప్రజ్ఞుఁడు గాంధి.

వస్తువులందు కోరిక గాని ఆసక్తి గాని లేక ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయవలెనని శ్రీ కృష్ణదేవుడర్జునునకు ప్రతి అధ్యాయము నందును బోధించి యున్నాడు. ఆవిధముగా వర్తించిన నిష్కామ యోగి గాంధి. నాకాందరకు గలిగినప్పు డెల్లను గీతామాత ఒడిలో తల దాచుకొందును. [illegible] నన్నొక్క సారియు మఱచి యుండలేదు అని గాంధి నేటికిని గీతను ప్రశంసించు చున్నాడు ఇట్టి [illegible] గీ[illegible] దీప[illegible] వెలుగున ప్రతి నిమేషము విహరించుచున్నాడు. ఈ తీరున నాతని తేజముక్రిందను మహనీయులును, మేలి పాత్రములును తోడుపడినవి.

నాల్గవ ప్రకరణము

ఇంగ్లాండు జీవితము

అసహాయోద్యమ దినములలో గాంధి యిట్లు చెప్పు చుండెడివాడు. మన పిల్లలను ఇంగ్లీషు పాఠశాలలకు బంపకుంటె బొట్టలపైన దిరుగ నిచ్చినను మంచిదే యని. తరువాత తరువాత నిదిషో అతడు నిష్కర్షగా చెప్పసాగినాడు, ఈ పాఠశాలలో చదువు పండ్యులు రావని, ఏమ్యా వచ్చియు రాని సోమరి మనుష్యుల తోడపాటు బన్ని [illegible] మాత్ర మలవడునని, ఈవిద్యా విధానము ఖర్చు తగులుబాటు గలదియునని. అతడు

చిన్నతనము నడుపుకొను నాటికిని ఈ పాఠశాలలు అంతియు. వీనిలో ఆతని కబ్బిన జ్ఞానమేమియు లేదు. పైఁగా బీడి, సిగరెట్లు త్రాగుట, దొంగతనము చేయుట, అసత్యమాడుట, మాంసము తినుట ఇవి మాత్రమే యతని కబ్బినవి. అయితే, పూజ్యురాలగు తల్లి నడవడి, రంభ ఉపదేశము, తండ్రి వాత్సల్యము, పురాతన కర్మ సంస్కారముల మూలమున నావికారము లేవియునాతని మూలంద్రోయ లేక పోయినవి.

పదునేడు వత్సరములు వచ్చునప్పటికి గాంధి ఈ దేశమున లౌకిక విద్యలోఁ గడదేఱినాఁడు. అంతట తాత ముత్తాతల దివాను పదవి పొందు నిమిత్తమై బారిష్టరు పట్టము పొందుటకు అతడు ఇంగ్లాండునకు పయనమైనాఁడు. తల్లి పుతలీబాయి బెంగ పెట్టుకొన్నది. ఇంగ్లాండులోని ఆడువారును, మగవారును, విచ్చలవిడిగాఁ దిరుగువారని, మద్య మాంసములు భక్షించువారని, ఆమె కెవరో చెప్పిరి. కాని ఆమె కుటుంబపు మేలుగోరువారు గాంధి ఇంగ్లాండు పయనమును నిర్ణయించివేసిరి. ఇఁక నామె యేమిచేయఁగలదు. మద్య మాంసములను, మగువను ముట్టనని కుమారునిచేత మాట గైకొని పుతలీబాయి యాతని నింగ్లాండు కంపివేసెను. అప్పటి కాతనికొక కుమారుఁడు గలఁడు.

ఇంగ్లాండులో నతఁడు దరిదాపు మూడేండ్లు గడపినాఁడు. ఆ కాలమును అతఁడు నేర్చుకొనుచున్నాడేమో. ఆత్మజ్ఞాన మావంతయు నతనికి పట్టుపడలేదు పైగా నది జిజ్ఞాసాపరులకు తావుగాదు. అక్కడ భోగవిలాసములు మిక్కుటము. ఆ దినములలో చదువు నేర్చుకొను యువకులందఱు విలాసములలో మునిగి యుండిరి. గాంధియు విలాస ప్రియుఁడయ్యెను. నూటయేబది రూకలు వెచ్చించి కోటు, బూటు, హేటు కొనెను. ఇండియా నుండి గడియారపు బంగారు గొలుసును తెప్పించెను. సంగీతము నేర్చుకొనుటకు ఫిడేలును కొనెను. నృత్యము నేర్చినగాని గౌరవము రాఁబోదని యొక పంతులను నియమించుకొనెను. సంగీతమునకు వేఱొక పంతులను కుదుర్చుకొనెను. అతనికి కొంత డబ్బు వ్యయమయ్యెను. వచ్చిన పాఠములు మాత్రము సున్న. ఇంతలో నతనికి ప్రాచీన సంస్కారములు మనసునకు తగిలినవి, అతఁడు గుర్తు తెచ్చుకొనెను. విలాస వస్తువుల సాంతముగా విడిచి పెట్టెను. సంగీతమునకు స్వస్తి చెప్పెను. ఫిడేలు నమ్మివేసెను. నర్తనము చాలించెను. అంతట మనసు కుదుటఁబఱచుకొని మితముగా జీవింప దొడగెను.

ఇది యిట్లుండ ఇంగ్లాండులో మఱియొక చిత్రము జరిగినది. అక్కడకు చదువునకుఁబోయిన భారత యువకులు తమ కింటికడ పెండ్లి పేరంటము లయినను, తాము కాల

బ్రహ్మచారులమని బొంకుచుండిరి. దానివలన, వారక్కడి
వయసువచ్చిన బాలికలతో స్వాతంత్ర్యముగాఁ దిరుగుచుండిరి.
గాంధియు నా యువకుల వలెనే బొంకినాఁడు తాను బ్రహ్మచారి
నని చెప్పుకొని, ఒక ఇంగ్లీషు కుటుంబముఁ గలసి మెలసి
పోయినాఁడు. అచ్చటి యువతులు తనితో చనవుగలిగి మెలగు
చుండెడివారు. గాంధికది బరువై పోయెను. మనోవేదన పెరుగ
సాగెను. అయ్యో! నే నసత్య మాడుచున్నానే యని యతఁడు
దుఃఖించెను. ఇట్లు పరితాపము పొందగా పొందగా నాతనికి
మనోబల మధికమయ్యెను. ధర్మసంరక్షణ కర్తవ్యమని తోచెను.
వెంటనే యతఁడు ప్రాయశ్చిత్తము చేసికొన నెంచెను అంతట
అతఁడు నాకు వివాహ మయినది. ఒక మగపిల్లవాఁడు సంతానము
కలిగినాఁడు. నేనిక మీతో బొంకితిని. మీ చెల్లెలికి తగుదునని
మీరు తలంతురేని మీకడకు రాఁగలను. నా తప్పును మన్నింపుఁ
డని ఆ యింగ్లీషు కుటుంబమువారికి వ్రాసి పంపెను. ఆ
కుటుంబమునకు పెద్ద, ఒక ముసలి యవ్వ. ఆమె కొక కూఁతురు
గలదు. వారాతని సత్యదీక్ష కబ్బురపడి, ఏమోయి గాంధీ,
రావోయి! నీ పెండ్లి ముచ్చట మాకు వినిపించవోయి యని
యాతనికి వ్రాసి పంపిరి. తన తప్పిదము నొప్పుకొనుటవలన
నతనికి ఆత్మబలము పెంపొంద సాగెను. సమాజమందతనికి
ఆదరము పెరుగ సాగెను. చివరకాతఁడా యింగ్లీషు కుటుంబము
వారికడకుఁబోయి తన కతను వినిపించి వారి మన్ననలఁబొందెను.

దీని తరువాత నొక భయంకర విషయము జరిగినది. ఒక రేపు పత్రమును [illegible] యముగూరలు గుసగుసవారి సభ కూడినది. గాంధి [illegible] యోగాన సత్యమును ఆ సమావేశమునకుఁ గొంపోయెను. ఆ చోట పడుచులును, పడుచువారును విచ్చలవిడిగాఁ దిరుగుచుండిరి. ఇది చూచి అతని తల నొచ్చెను. అయ్యో! ఈ పాప కూప మేమి, నా తల్లికిఁ జేసిన బాస లేమి యని యతఁడు వగచెను. ఇంతలో నొక చెలికాఁడతనిఁ జూచి ఓయీ! నీవేమి? ఈ పాప కూటమేమి? తొలగి పొమ్మని హెచ్చరించెను. గాంధి తిన్నని వారి తప్పు [illegible] గాను, దయామయుఁడగు దేవుఁడా చెలికాని ప్రేరేపించెను. అంతట గాంధి, బ్రతుకుజీవుఁడా, యని తన మందిరమునకు పాఱి వచ్చి రామునకు కోటి దండములు పెట్టుకొనెను.

ఈ విధమున సత్య విలాసములనుండి, అసత్యమునుండి జారత్వమునుండి తప్పించుకొని బయటపడఁ గలుగుటయే గొప్ప పని యయినది. ఇవి మూఁడును విడిచినచో, ఇంగ్లాండులో సతని జీవితమంతయు నియమవంతమయినది. సదాచారములతో నిండినది. ఈ సంపద సత్యము భారత భూమినుండియు, ఋషి సంప్రదాయమునుండియు, గుణవంతులైన తల్లిదండ్రుల నుండియు, సతీమణియగు కస్తూరిదేవి నుండియు సంభవించు కొన్నాడు. మద్య మాంసముల కలవాటుపడిన యీ దేశమున

సతతము మిక్కిలి నిబ్బరముతో గాయగూరలు మాత్రమే కుడిచి కాలము గడపి తల్లికిచ్చిన బాస నిలుపుకొని తన దేశమునకు దిరిగి రాగలిగినాడు. పెక్కువేలేండ్లు తపము గావించిన మునులు, విలాసవతుల యొయ్యారములకు జిక్కి భ్రష్టులై చనినారు. కాని యాతడు కాలింగ్లాండులో బురదలో కాలిడకుండ బయటకు రాగలిగినాడు. ఇది యాతని పెద్దతనము. ఇది భారతభూమి ప్రసాదము.

తల్లి మంత్రములనుండి లభించిన ధర్మబీజము చిన్ననాటనే యంకురించి, ఇంగ్లాండులో రెండాకులు తొడిగినది. అచ్చోటనే యతనికి భగవద్గీతయను మణిదీపము దొరకినది. దాని వెలుగు వనే నేటికిని అతడు నడచుచున్నాడు. ఆ నల్లనయ్య గీతాగాన మాతని చెవిసోకినది. ఆ గానమే నేడు గాంధిగారిని కర్మయోగిగా మహోన్నతునిగా, మేరు సమానునిగా జేసినది.

ఆయిదవ ప్రకరణము

తొలికాలపు బారిష్టరీ

గాంధి యింగ్లాండులో బారిష్టరు పట్టము పొంది స్వదేశమునకు దిరిగి వచ్చెను. అప్పుడు అతని వయస్సు ఇరువది సంవత్సరములు. అతనికి లోకానుభవము లేదు. అతడు కోర్టులో వాదించు

నేర్పు ఎఱుఁగఁడు. 'హిందూ లా' తెలియదు. ఆనాఁటి విడి యంతయు పుట్టెడు. ఇట్టివాఁడు ఏమి ప్లీడరీ చేయును? ఏమి సంపాదించును? ఎట్లో అతఁడు కొంత కాలము రాజకోటలోను కొంత కాలము బొంబాయిలోను బారిష్టరీ సాగించెను. కాని ఏమియు గిట్టుబడి కాలేదు. పైఁగా పెద్ద వకీళ్ళకు, దళారులకు లంచములు, కమీషనులు, చెల్లింపుతో నాతని తల తిరిగి పోవుచుండెను. ఎట్లెట్లో కాలము గడుపుచు అతఁడు దస్తావేజులకు ముసాయిదాలు వ్రాసి యిచ్చుచు నెలకు మూఁడు వందల రూకలు గడించుచుండెను. ఈ లాయరు జీవిత మతనికి 'లయరు' (అబద్ధాలకోరు) జీవితమువలె తోఁచుచుండెను. రాజకోట, పోరుబందరు సంస్థానములందు కుట్రలు పెరిగినవి. కఠియవారు దేశమందంతటను ఇట్టి విషమే కనబడుచుండెను. దీనితో గాంధి మనస్సు విరక్తమైపోయెను. ఈ దేశమునుండి కదలి యెక్కడకైనను పోయిన బాగుండునుగదా యని యతఁడనుకొనెను.

అనుకొన్నట్లు, అతనికి దక్షిణాఫ్రికానుండి పిలుపు వచ్చినది. అతఁడంతట రామచంద్రప్రభూ. ప్రతిరేయి క్రొత్త దేశము చూచు ముచ్చటయుఁ దీరగలదు. ఇచ్చటి విషపు గాలులనుండి తప్పించుకొనవచ్చును. ఒక్క యేఁడాదియే గదాయని వెంటనే అతఁడా పిలుపు సంగీకరించెను.

ఆఱవ ప్రకరణము

దక్షిణాఫ్రికాలో గాంధి

మన దేశమునకు నాలుగువేల మైళ్ళ దూరమున పడమరగా ఆఫ్రికా ఖండమున్నది. దాని దిగువ భాగమునకు దక్షిణాఫ్రికా యని పేరు. అది భారత దేశమంత పెద్దదై యున్నది. అందు నాలుగు రాష్ట్రము లున్నవి. వానిలో "నేటాలు" "ట్రాన్సువాలు" అనునవి ప్రధానమయినవి. అది బంగారు పండు దేశము. నేల మిక్కిలి సారవంత మయినది. గోధుమ, మొక్కజొన్న, చెఱకు అపరిమితముగా పండును. పండ్లు అన్ని జాతులవి ఫలించును. ఆ దేశమున బంగారు గనులు, వజ్రపు గనులు విస్తారముగా గలవు. అక్కడకు ఇంగ్లీషు వారును, డచ్చివారును వలసవచ్చి, భూస్వాములై, వేలకొలది యకరములు సేద్యము చేయుచు, కోట్లకొలది డబ్బు గడించుచుండిరి. పైగా వర్తకము పెంపు చేసికొనుచుండిరి. ఈ తెల్లవారు, ఆఫ్రికా వాసులు కారుగా. ఎక్కడనుండియో వచ్చినవారయిరి. అసలు ఆఫ్రికాలో ఆదివాసు లున్నారు. వారిని కొండజాతి వారని, అడవి జాతి వారని యందురు. వారికి జూలూలని పేరు. వారు పొట్టకొఱకెన్నడును తమ్ము నమ్ముకొనరు. ఒడలువంచి యితరుల కూడిగము చేయరు. వారు దృఢకాయులు. ఆజానుబాహువులు. సుందరులు. సత్యప్రియులు. కాని పిఱికిపందలు. తుపాకిచూచి పాఱిపోవుదురు. ఇట్టివారు తెల్లవారి కేవిధముగనూ దుస్సాధ్యులైరి.

కావున దక్షిణాఫ్రికా లోని తెల్ల యజమానులకు తోట కూలీలు, పొలము కాపులు, కావలసివచ్చిరి. అందువలన వారు భారత ప్రభుత్వమువారిని కొందఱు కూలీల బంపుడని వేడు కొనిరి. వారంగీకరించిరి. హిందూస్థానమునుండి కూలీలు వచ్చి పడిరి. ఎక్కువమంది తెలుగు దేశమునుండియు అరవ దేశము నుండియు వచ్చిరి. వీరుగాక గుజరాతు, బొంబాయి ప్రాంత ములనుండి కొందఱు వర్తకులును, గుమాస్తాలును వచ్చిరి. ఈ విధముగా గాంధి దక్షిణాఫ్రికా పోవునాటికి అచ్చట ఒక లక్ష యేబదివేలమంది భారతీయు లుండిరి.

వారు మిక్కిలి పొదుపరులు. కాయకష్టము చేయువారు. కనుక కొలది కాలములోనే వారనేకములగు కాయ్యలు, కూరలు పంటలు పండించిరి. ఇది లోగడ ముప్పది యేండ్లలో జరిగినపని. దానిని తెల్లవారి కన్ను కుట్టినది. భారతీయులు, క్రమక్రమ ముగా దక్షిణాఫ్రికాను ఆక్రమించి తాము వ్యవసాయమును వర్తకమును, ధనమును, పలుకుబడిని, నాచికొందురను వెత్తి భయము వారికి కలిగినది. ఆ తెల్లవారంతట తమ ధోరణను వారికి విప్పి యెత్తించిరి. వారు శాసనములు చేయసాగిరి. ట్రాన్సువాలులో పాదము మోపిన భారతీయునకు సాలుసరి అయిదు రూకల పన్ను విధించిరి. భారతీయుల నూరి వెలుపల గూడెములలో ఇండ్లు కట్టుకొమ్మనిరి. వారి నక్కడనే వర్తకము

చేసికొమ్మనిరి. వారి బిడ్డలను పాఠశాలలలో చేర్పరాదనిరి. భారతీయుల కంతట దక్షిణాఫ్రికాలో చాకళ్ళును, మంగళ్ళును సైతము లేకపోయిరి. హిందుస్థానీయులు రాచ బాటలపై నడవరాదు. మొదటి తరగతి రైలు పెట్టెలలో నెక్కరాదు. హోటళ్ళలో బస చేయరాదు ఇన్ని మాట లెందులకు. ఇక్కడి మాల మాదిగలకు పట్టినగతియే అక్కడి భారతీయులకు పట్టినది. కనుకనే భారతదేశమున హరిజనులయెడ పెద్ద కులములవారు గావించిన అపచారమునకే ఫలమని దక్షిణాఫ్రికాలో కట్టి కుడుపు చున్నదని, దానికి వెంటనే, హరిజనుల నుద్ధరించి, పావితము చేసికొండని గాంధి స్వదేశీయుల నెప్పుడు మందలించు చున్నాడు. ఇది అతఁడు దక్షిణాఫ్రికాలో కాలుపెట్టి నప్పటికిగలదశ. అప్పటి కతఁడు నూనూగు మీసములవాఁడు. అతని ప్రాయము ఇరువది మూఁడేండ్లు.

ఏడవ ప్రకరణము

పోరాటము

దక్షిణాఫ్రికాలో ఇద్దరు వర్తకులుండిరి. దాదా అబ్దుల్లా, తయాబ్జీ అను వారలు. వారు తమలో తాము బంధువులును కూడా. వారికి వర్తకములో జగడముపుట్టెను. దాదా అబ్దుల్లా, తయాబ్జీ నుండి ఆరు లక్షల రూపాయలు రావలెనని అతనిపై దావా

వేసెను. ఈ కేసులో దాదా అబ్దుల్లా పక్షమున పనిచేయుటకే గాంధి దక్షిణాఫ్రికాకు పోయెను. పోయిన యేడాదిలో అతఁడా కేసును రాజీచేయించి దాదా అబ్దుల్లా సేటునకు, తయూబ్జీ ఆఱు లక్షల రూపాయలు వాయిదాల ప్రకారమిచ్చునటుల ఏర్పాటు గావించెను. దీనితో నతఁడు పోయిన పని ముగిసినది. అంతట నతఁడా సీమనుండి కదలి తన దేశము వచ్చుటకు పయనమయ్యెను.

ఇంతలో నేటాలు దొరతనమువారు, భారతీయులకు వోటు హక్కు లుండరాదను బిల్లును ప్రకటించిరి. దానిని చదువుకొని గాంధి దద్దరిల్లెను. అయ్యో! పిచ్చుకపై బ్రహ్మాస్త్రమన్నట్లు నోరులేని భారతీయులపై, దొరతనమువారు కష్టములు తెచ్చి పెట్టుచున్నారని యతఁడు విచారించెను. ఆ బిల్లు నెదిరింప వలెనని యతఁడు గట్టిగా సంకల్పించెను. వెంటనే పెద్ద యాందోళన లేవదీసెను ఈ లోపున నేటాలులో మఱియొక బిల్లు ప్రకటింపబడెను. గిరిమిటియాలు, అనఁగా అయిదేండ్ల కంట్రాక్టుమీఁద ఇండియానుండి వచ్చిన కూలీలు, తమ షరతు అనంతరము దక్షిణాఫ్రికాలో నివసింపవలెనన్న తల ఒకటికి మూఁడువందల డెబ్బదియయిదు రూపాయల పన్ను చెల్లింప వలెనని దొరతనమువారనిరి. దానికిని గాంధి పెద్ద యాందోళన జరిపెను. కాని ఫలితమున ఆ పన్ను తల ఒకటికి నలువది

యయిదు రూకలయినది, గాని సాంతముగా నశింపలేదు. ఇది పూర్తిగా నశించు నంతవఱకు నిద్రపోరాదని గాంధి నిశ్చయించెను. దాని వినాశనమునకై యత్నము మిన్ను మన్ను నేకము చేసెను.

దక్షిణాఫ్రికా భారతీయుల కష్టములు తొలగించుటకై చివర కతడచ్చట కాపురము పెట్టెను. బారిష్టరీకూడా చేయుచునే యుండెను. అత డచ్చటి భారతీయుల దుఃఖములు సింహావలోకనము చేయఁగా నవి అనేక విధములుగా నుండెను. అక్కడి దొరతనమువారు భారతీయుల నచ్చటకు రాఁగూడదనిరి. అథవా, వచ్చినచో వేలు ముద్రలు వేయవలెననిరి. లైసెన్సులేక వర్తకము చేయరాదనిరి. భారత దేశమున జరగిన, రిజిష్టరు కాని పెండ్లిండ్లు శాస్త్రీయములు కావనిరి. ఈ అధర్మముల నన్నిఁటిని, రూపు మాపుట కతఁడు సత్యాగ్రహముల సాగించి దొరతనముతో హోరాహోరీని పోరు సలిపెను. ఈ పోరాటము ఇరువది యేండ్లు పట్టినది. చివరకు సత్యమునకు గెలుపు గలిగెను. గాంధికి గెలుపుగలిగెను. ఆతని నాయకత్వమున నడచిన దక్షిణాఫ్రికా వీరులకు, వీర రమణులకు గెలుపు కలిగెను. అధర్మమును, ఆ దొరతనమును ఓడెను. అంతట ఆ దొరతనమువారు గాంధిని పిలిచి, నీ చెప్పిన

ఛ్పొప్పున నడచు కొందుమని బాస యిచ్చి, యాతనితో రాజీ పడెను. దానివలన, తలపన్ను పోయినది. వేలుముద్రలు పోయినవి. మిగిలిన కష్టములును తొలగినవి.

ఈ కాలముననే యాతని ధర్మ జీవితము పువ్వు తొడిగి వికసించెను. ఈ కాలమున అతడు సత్యదేవుని విడువలేదు. ధైర్యమును విడువలేదు. దొడ్డతనము విడువలేదు. ధర్మసంస్థాపనకై యాతడు పడినన్ని కష్టములు హరిశ్చంద్రుడు పడలేదు. మానవ సేవయే, మాధవసేవయని అతడు తన ప్రాణములొడ్డి దీనసేవ చేసెను. నిష్కళత్తుల ధారతనము నెదిరించి ముక్కాకల తేతిన పోటుబంటగుట నాతని జయలక్ష్మి వరించెను. అక్కడనే యతడు ఋషి యయ్యెను. ఆశ్రమవాసి యయ్యెను. బ్రహ్మపదావలంబుడయ్యెను. దక్షిణాఫ్రికా సీమను తానఖండ తేజము నొప్పారి, పదిదిక్కుల వెలిగించు తన యాత్మ కాంతితో నతడు తల్లి దేశమునకు చల్లగా తిరిగి వచ్చెను.

ఎనిమిదవ ప్రకరణము

స్వ దే శ ము లో గాం ధి

ఇక గాంధి తన గుజరాతునకు కదలి చని సబర్మతి నది యొడ్డున ఆశ్రమపద మొందు నిర్మించుకొని వికారము

లభించి సత్యదేవుని ప్రజలు సుఖముగా [illegible] నుండెను. ఆగస్తి పడిన దేశములన్నిటా ప్రల [illegible] దీనుల పాలిటి కాపాడేనవను కీర్తి [illegible] పొందెను. అధర్మ [illegible] పుమాప నవతరించిన మనుజసింగము పేరు ఆనోట ఇనోట వినవచ్చెను. అంతట తండోప తండములుగా దీనజను లాతని పాదములకడకు రాఁదొడఁగిరి.

వీరంగాం నగరములోని పేద జనులు కొందఱు వచ్చి, మహారాజా! మేము మునిసిపలు పన్ను బాధ పడలేకున్నాము. మా కన్యాయము జరుగుచున్నదని యాతనితో మొఱపెట్టుకొనిరి. అతఁడా సంగతిని చక్కఁగా విచారించెను. పేదవారి మాట నిక్కమని తేలినది. గాంధి సత్యాగ్రహమను ఆయుధమును జళిపించెను. అంతట వారికా మునిసిపలు పన్ను బాధ తొలఁగిపోయెను. ఆపేదలు గాంధికి వేయి దండములు పెట్టుకొని సుఖించిరి.

ఇంతలో మఱియొక ఆర్తనాదము వినవచ్చినది. గుజరాతులో కైరా అను మండలమున్నది. అందొకప్పుడు అనావృష్టి దోషముచే పంటలు పాడయినను, రైతులు పొలములకు నిండు పన్ను చెల్లింపక తప్పదని దొరతనమువారు పట్టుపట్టి కూర్చుండిరి. దీనులగు రైతులు గాంధి యడుగులమీఁద పడిరి. అతఁడా విషయమును పూర్తిగా తెలిసికొనెను. రైతులదే

న్యాయమని, దొరతనమువారి అన్యాయమని తేలినది. అతఁడు ముత్తరిదారిని దొరతనమువారికి నచ్చఁజెప్పఁజూచెను. కాని అధికారులు ఆతనిమాటను పాటింపక పైఁగా అవమానముచేసిరి. అంతట గాంధి వేఱుదారి లేక సత్యాగ్రహము సాగించెను. జనులు చాల వెతల నొందిరి. ఒక పట్టున దొరతనము వారు వినలేదు. సంస్థానులచే రైతులు బాధింపఁబడిరి. పొలములు వేలము వేయించిరి. పంటలు లోఁబడి పోయెను. కూటికి గుడ్డకు లేక పేదరైతులు అల్లాడిపోయిరి. అప్పుడును వారు గాంధిని నమ్ముకొనియే యుండిరి. చివరకు సత్యమే జయముపొందినది. రైతులు గెలుపొందిరి. జయలక్ష్మి గాంధిని తిరిగి వరించినది.

ఇంతలో దీనుల మొఱ్ఱ మఱియొకటి విన వచ్చినది. బిహారు దేశములో చంపారణ్యా మను మండలము గలదు. అందలి రైతులకు చిత్రమైన బాధ ఏర్పడినది. అక్కడి తెల్ల వారు కొందఱు పెద్ద యకరములను తాము యేలుబడి లోనికిఁ దెచ్చుకొని నేద్యము చెయించుకొని మితి మీరిన లాభములు పొందు చుండిరి. వారు రైతుల కొక నియమము గావించిరి. ఆమండల మునఁగల ప్రతి రైతు ఆ తెల్ల దొరలకు తప్పక పొలములో నీలిమందు పండించి వారు కోరిన ధరలకు ఇచ్చుచుండవలెను. అట్లు చేయకుండుటకు వీలు లేదు. దానికి దొరతనము వారి శాసనము కూడ గలదు. ఈ విధముగా నూఱేండ్ల నుండి

జరుగుచున్నది. దీని నాశించు వారును, పాలించువారును లేరయిరి. అంతట ఆ రైతులు గాంధి చరణముల వ్రాలి తమ సొదను వెళ్ళబోసిరి. గాంధి అతఁడా సంగతిని లెస్సగా విచారించెను. రైతులది న్యాయమని నమ్మెను తెల్ల దొరలతో పోయి మాటలాడెను. వారతనిని సరకు గొనరైరి. అతనికి వేఱుదారి తోఁపలేదు. సత్యాయుధము వెలికి తీసెను. సత్యాగ్రహము నడపెను. అన్యాయ మడుగంటెను. తెల్లదొరల యవినీతి లోకమునకు తెలిసెను. సీమనుండి నిర్బంధము వచ్చిన కైన లేకుండ మాయ మయ్యెను. రైతులకు న్యాయము కలిగెను. గాంధి నామమునకు వన్నె వచ్చెను. అతఁడే సత్యవంతుఁడు, న్యాయవంతుఁడు, మహాయోధుఁడు, ప్రేమమూర్తి, వినయ సుందరుఁడను కీర్తి దశ దిశలను ప్రాకి పోయెను.

ఈ విధముగా నతఁడు పెక్కుమారులు అనాథ సేవ చేయుచు మాధవు పూజ గావించు కొనుచుండెను. ఇట్లుండ నొకసారి యతఁడు భారతభూమిని కంటినిండ చూచినాఁడు. భారత ప్రజలు కూడు గుడ్డలులేక అవినీతిపరులై యున్నారు. గంగయొడ్డున పెక్కువేలేండ్లు తపము గావించిన మునులు వేసిన దారిని విడచి భ్రష్టులైపోవుకమాలి యుండుట గని దురపిల్లినాఁడు. ఈ దీనదశకు కారకు లెవ్వరని యతఁడు యోచనచేసినాఁడు. దీనికి దొరతనము వారుతప్ప నేటొకరు కారకులు కారని అతఁడు

తన దివ్యతేజమును చూపి నిర్మూలించినాడు. ఇట్టి దొరతనముతో పొత్తుగలిగియుండుట తన సత్యదీక్షకు భంగమని దానితోడి సహాయ నిరాకరణమును ఎలుగెత్తి చాటినాడు. తన జనులకు సత్యము, ప్రేమ, శాంతి బోధించినాడు. వానిమూలమున నతడు తన దేశమునకు వెలుగు నిచ్చుటయేగాక విశ్వమున కంతకును కాంతిని ప్రసాదింప నేటికిని దీక్షితుడై యున్నాడు.

తొమ్మిదవ ప్రకరణము

వినయము.

ఇక గాంధి కళ్యాణ గుణముల పరిశీలింతము. అతడు వినయ సుందరుడు. చిన్నతనమున వినయ మతనికి వెన్నతోడ రంగరించి పెట్టినది యాతని తల్లి. అతడెన్నడును తలి దండ్రుల మాటగాని, గురువులమాట గాని, జవదాటి యెఱుగడు, పెద్దల నతడు బంటువలె సేవించువాడు. పెద్దల దోసములాతడు తడవి యెఱుగడు. ఒక సారి యతని పంతులు అతని నసత్యమాడు మని ప్రేరేచెను. గాంధి యసత్య మాడ లేదు. అంత మాత్రముచే అతని కాతని పైన విసువు గాని, యవమానము గాని కలుగ లేదు. పైగా నా పంతులు నందరికి గొప్పవాడని మెప్పుకొనెడి. ఇట్లు అతడే దేశమందున్నను పెద్దలను గారవించుచు తన మతము నంగీకరింపని వారిని సయితము సేవించుచుండు

వాఁడు నూనూఁగు మీసాల వయసుననే సర్ ఫిరోజిషా మెహాతా, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర తిలకు, రామకృష్ణ భండార్కరు మున్నగు దిగ్గజముల పాదములకడఁ గూరుచుండి సేవా నిరతి నేర్చియుండెను.

అటువెనుక కొంతకాలమునకు కాంగ్రెసు మహాసభ కలకత్తా నగరములో జరిగినది. ఆకాలమున భూపేంద్రనాథ బోసు, గోశాల్ అను వారలు కార్యదర్శులుగా నుండిరి. గాంధి అప్పటికి ముప్పది సంవత్సరముల ప్రాయమువాఁడు. మంచి చేవ గలిగిన బారిష్టరని పేరుమోసినవాఁడు. దక్షిణాఫ్రికా దొరతనము వారిని మూడు ఊపులు ఊపి, వలసినంత లోకానుభవము గడించినదిట్ట.

అట్టివాఁడు గోశాలుకడకుపోయి, పూజనీయుఁడా, ఈ కాంగ్రెస్సు మహాసభకు నన్నొక సేవకునిగాఁ జేర్చుకొని నా నుండి పనిగొమ్మని యాతనిఁ వేఁడుకొనెను. అతఁడు గాంధి చరిత మంతయుఁ దెలిసికొని, యాతనిఁజూచి, ఓయీ! నీవంటి పసుచు బారిష్టరులు చేయవలసినపని నా కడ నేమున్నది. అయినను, అదిగో, ఆమూలాల చూడుము. గుట్టలు గుట్టలుగా నా లేఖలెల్ల పడియున్నవి. వానికి సమాధానము వ్రాయవలెను. వ్రాయుమనెను. ఆ పలుకులకు గాంధి సంబరపడి

యాతనికి దండములు పెట్టి ఆ పని వెంటనే చేసివేసెను. దానికి గోఖాలు మిగుల సంతసించెను. అతఁడును, ఆ కాలపు కాంగ్రెసు కార్యదర్శులవలె వైభవ దర్పములు గలవాఁడు. అతఁడు తన క్రింద యుద్యోగులచే చిన్న చిన్న స్వంత పనులు చేయించు కొనుచుండెడివాఁడు. అట్టి గాంధి చేతను ఆ పనులు చేయించుకొనెడివాఁడు. అతఁడు నిలువఁబడి చేతులుచాచి యుండ గాంధి యాతని కోటుతెచ్చి తొడిగి బొత్తాములు పెట్టు చుండెడివాఁడు. ఓహో! పెద్దలన్న గాంధి కెంత భక్తి, ఎంత వినయము!

ఈ వినయమే యాతని గుణ సంపదకు మూలకందము. ఈ వినయమే యాతని తేజమునకు కుదురు. అతఁడు, ఏ దొరతనమును డీకొన్నను వినయవంతుఁడై డీకొనెనుగాని, గరువముతో నట్లు చేయలేదు. ఒక్క పోలికను పరిశీలింపుఁడు. అర్జునుఁడు తన గురువగు ద్రోణునితో పోరుసలిపెను. అతఁడతని పాదములకడ నొక బాణము పంపి వందన మాచరించి, మఱి రెండమ్ముల నాతని చెవులకడ కనిపి కుశలప్రశ్న చేసెను. ఆ విన్నాణమే గాంధి యలవఱచుకొన్నాఁడు. అతని పోరితమంతటను ఆ శుభ లక్షణమే వెలుగొందు చుండును.

పదియవ ప్రకరణము.

సత్యదీక్ష

గాంధి జీవితమంతయు సత్యారాధనయే. అతని తలంపులలో పలుకులలో, చేతలలో సత్యము నిండి తొలకుచుండును. సత్యమే యాతని దేవత. చిన్నతనమున నాతని నడవడియందు చిన్న చిన్న దోసగులు పొసగినను, అతని చిత్తముమాత్ర మెన్నడును సత్యము వంకనే ముఖము చూపుచుండెను.

ఇక నాతని వృత్తిని విచారింతము. అతని వృత్తి ప్లీడరీ. ఇతరులపట్ల నీవృత్తి కపటములకు, అసత్యములకు చోటయినది. కాని యతనికిమాత్ర మావృత్తియందెట్టి తుపాను సమయములందును తన సత్యదీక్షను విడువలేదు. ఇది యాతని యందలి విశేషము. అతడిరువది వత్సరములు ప్లీడరీ చేసెను. చిన్న ప్లీడరీగాడు. సాలునకు డెబ్బదియయిదు వేల రూపాయలు ఆరుమానముగల గొప్ప ప్లీడరీ. అదికూడ తెల్లవారి కోర్టులలో తెల్ల బారిష్టరులమధ్య. అతడు మంచి పలుకుబడి, మంచి జాణతనము, మంచి శ్రద్ధగలవాడు. ఆ ప్లీడరీకాలమంతటిలోను అతడు సత్యమార్గమునే, పదముతో త్రికరణశుద్ధిగా నడచెనుగాని, అసత్యమార్గమునం బడియుండలేదు. అతడు సత్యవాది, న్యాయవాదియని గుర్తించి జనులతనికి నిజమైన కేసులనే యిచ్చెడి

పాడు. అత డసత్యపు కేసులు చేపట్టి యెఱుంగఁడు. కేసు నిజమయినది. వాదము నిజమయినది. వాది నిష్కళంకపు మనుజుడు. అట్టి కేసు గెలుపొందుటలో నబ్బుర మేమున్నది. గాంధి సత్యవంతుడని; న్యాయమూర్తియని, న్యాయమూర్తులకు తెల్లమై పోయెను.

ఇంగ్లండ నొకనాఁడొక చిత్రము జరగినది. ఒక టక్కరి, గాంధి కడకుపోయి అసత్యపు కేసు నొక దానిని, నిష్కళంకపు కేసని అతని నమ్మించి వాదింపుమనెను. గాంధి దానిని నిజమని నమ్మి వాదింప మొదలిడెను. కొంత వాదము నడచిన వెనుక అతనికి సత్యము గోచర మయ్యెను. వెంటనే యతఁడు న్యాయమూర్తితో, అయ్యా, ఈ కేసు తప్పుదాఁది. నాకు తెలియక దీని చేపట్టితి. నన్ను మన్నింపుఁడు. తమరు దీని నెదిరిపక్షమున కనుకూలముగ తీర్పు చెప్పవచ్చుననెను. అంతట జడ్జీ యాతని సత్యదీక్షకబ్బురమంది, ఓరా! గాంధీ ఎంతవాడవైపోయి యను కొనెను. ఆ టక్కరి కేసు మంటగలసిపోయెను.

మఱియొక చిత్రము జరగినది. ఒకప్పుడొక పలుకుబడి గల వర్తకుఁడు దొరతనమువారి కన్నుగప్పి దొంగ వ్యాపారము చేయుచుండెను. దానిపై, వారు కన్నుదెఱచి దొంగను బట్టుకొని కేసు పెట్టిరి. అతఁడు కంపించిపోయెను. ధననష్టముగు

నని యాతనికి జెప్పులేదుగాని పేరు ప్రతిష్ఠలు గంగపాలగునని భీతిజెందినాఁడు. వెంటనే యతఁడు గాంధి పాదములకడకు పోయి అయ్యా! నాకీగతి పట్టినది. నాకేది దారి యనెను. గాంధి శాంతముగా విచారించెను. వర్తకుని సమాచారము తెలిసికొనెను. అంత నాతనిం జూచి, అయ్యా! దీనికొక్కటే యుపాయమున్నది. ఉద్యోగులకడకు బోయి నీతప్పు నొప్పుకొనవలెను. అట్లు చేయఁదలఁచినచో నేను నీకు సాయపడఁగలననెను. అంతట నా వర్తకుఁడు కొంత ముందు వెనుకలు చూచెనుగాని చివరకు గాంధి యుపాయమునే యంగీకరించి, దొరతనమువారియెడ తన తప్పు నొప్పుకొని, యికముందునుండి అట్టి కల్లరితనము సేయనని బాసచేసి చరితార్థుఁడయ్యెను. దీనివలన నా వర్తకుని కీర్తి తఱుగలేదుసరికదా పెరిగినది. అతఁడు తన చేసిన తప్పిదమును పాచితమును కాగితముపై వ్రాసికొని, పటము గట్టించి, గోడకు వ్రేలాడఁదీసికొని, నిత్యము స్మరించి, సత్యమార్గము నవలంబించెను. ఇటుల గాంధి తాను సత్యావలంబకుఁడగుటయేగాక, తన తోడివారలను, తన్ను జూసినవారలను సత్యవంతులుగా నొనర్చెను. అతఁడు దక్షిణాఫ్రికా దొరతనమువారిని, ఇండియా దొరతనమువారిని, బ్రిటిషు దొరతనమువారిని, ఇంకను పెక్కు అధర్మ సంస్థల నెదిరించెను. పోరు సలిపెను. గెలుపొందెను. ఈ పోరాటములందాతనికి సత్యమే నడక. కార్య కలాపములందింత సత్యవంతుని వేఱొకని చూడము.

కష్టపరంపరలు - అహింస.

ఈ సత్యదీక్షను పాలించుటకు గాంధి పడిన కష్టములనంతములు. ఇంత జ్ఞాని. ఇంత పండితుఁడు. ఇంత గుణవంతునకు సత్యముకొఱకిన్ని యిడుమలు గుడుచుట యబ్బురముకాకపోదు. ఏ మహాపురుషుఁడును ఇన్ని యవమానములను భరించి యుండలేదు.

గాంధి దక్షిణాఫ్రికా చరిత్రమంతయు కష్ట పరంపరలతో నిండినది. ఆ దేశమందు, తెల్లవారు తమ దొరతనమును తమ యిచ్చవచ్చినటుల సాగించుకొనుచుండిరి. ఆ సమయమున గాంధి నూనూగు మీసములవాఁడని చెప్పితిమిగదా. అతఁడు దక్షిణాఫ్రికాలోని యొక రైలుస్టేషనునకుపోయి మొదటితరగతి రైలు టికెట్టుకొని, మొదటితరగతి రైలుపెట్టెలో కూరుచుండెను ఇంతలో నొక పోలీసువాఁడువచ్చి యాతని జూచి, నీవీ పెట్టెలో గూరుచుండరాదు, నల్లవాఁడెంత దొడ్డవాఁడయినను నల్లవాఁడే దిగిపోయని గద్దించెను. గాంధి కదలననెను. అంతట నాతఁడాతని చేయి పుచ్చుకొని బయటకు పడద్రోసి, యాతని సామానులు విసరి పాఱవేసెను. రైలు కదలిపోయెను. ఆ రాత్రి గాంధి ఆ రైలుస్టేషనులో, ఆ క్రొత్త దేశములో, తినుటకు తిండిలేక, చలిలో గజ గజ వణకుచు, తన మాట తాను విప్పుకొన్న

తిరిగి నేను ఉపవాసము కలుగునో, ఎవరిని పలుకరించిన
ఎవరు కసరుకొందురోయని యూ దియూనుయుని స్మరించుచు
మిన్నకుండెను.

మఱునాఁడు గాంధి తన జాతివారికి కలుగుచున్న
యిబ్బందులను తొలగింప నిశ్చయించుకొని, దానికి పరుసలుప
నేమముకట్టి రైల్వే మేనేజరునకు, దాదా అబ్దుల్లా సేటునకు
జరిగిన సంగతిని గుఱించి తంతివార్తలు పంపెను. వారుభయు
లును ఆతని కానాఁడు శయనమున కనుకూలముగావించిరి.
అంతనొకతఱి అతఁడు గుఱ్ఱపు బండిపై ప్రయాణము చేయు
చుండెను. ఆ బండివాడు తాను చుట్టకాల్చుకొనుటకు
గాంధి కూర్చుండిన చోట కూరుచుండఁ దలచి, అతఁడు
నల్లవాఁడు గనుక అతనిని తన కాలికడ మైల గోనెపైఁగూరు
చుండుమనెను. దానికి గాంధి నిరాకరించెను. అంతట నా బండి
వాడు గాంధిని చెంపలు పగుల గొట్టెను. అటుపిమ్మట గాంధి
మరల రైలుపై పయనముసేయవలసివచ్చెను. అతఁడు స్టేషను
మాష్టరునకడకేగి తిరిగి మొదటితరగతి టికెట్టునే కోరెను. ఆమాష్ట
రతనికి టికెట్టు నిచ్చుచు, ఓయీ! గాంధీ, నీకీ టికెట్టు నిచ్చుటకు
నా కేయాటంకము లేదు. కాని గార్డువచ్చి నిన్ను పొమ్మన్న, నీవు
రైల్వేకంపెనీపై దావాచేయరాదనెను. గాంధి దానికి సమ్మతించి

మొదటి తరగతి పెట్టెలో పోయి కూరుచుండెను. ఆ పెట్టెలో నొక తెల్ల దొరసాని కూడ నుండెను. అంత గార్డు వచ్చెను. అతడు గాంధిని జూచి, ఓయీ! దిగిరా. రాకుంటివా, చూడు నా దెబ్బ యనెను. అంతట గాంధి తోడి తెల్లదొరసాని గార్డుతో ఓయీ! ఈతని సరసను కూరుచుండుటకు నాకే యవమానము లేకయుండ నీవెందుల కితని బాధింపెదవనెను. గార్డంతట చేయునదిలేక గొణుగుకొనుచు తన దారిని పోయెను. లోకములో చీకటి వెలుగులొకదాని వెనుక నొకటి వచ్చు నట్టుల దక్షిణాఫ్రికాలో గాంధికి మొదట భీకర దర్శనము, అటు వెనుక అద్భుత దర్శనము పరంపరగా వచ్చుచునే యుండెను. ఆ రెండిటియందు నాతడు భగవానుని దివ్యరూపమునే చూడనేర్చెను.

మఱియొకసారి యతడొక బాటపై బోవుచుండెను. అది రాత్రి సమయము. రేయి తొమ్మిదిగంటలు దాటినపిదప ఆ బాటపై భారతీయుడెవడును పోరాదు. ఒకవేళ పోదలచినచో వానికి పోలీసువారి చీటి యుండవలెను. గాంధి కడ చీటి లేదు. అనాగరికుడగు పోలీసువాడు వచ్చి యతనిని చీటినిగురించి యడుగకయే, లాగితన్ని, తఱిమివేసెను. ఇదంతయు గాంధి చెలికాడొక తెల్లవాడు చూచుచుండెను. అతడు గాంధినిజూచి ఏమోయి, నీవంటివానిని ముందుగా [illegible] తెలిసికొనలేక

కొట్టినందుకా పోలీసువానిపై కేసు పెట్టుము. నేను సాక్షిగా నుందును. అతనికింత పొగరాయనెను. గాంధి యాతనితో మిత్రుండా! నాదొక ప్రతిన గలదు. నాకుఁగలిగిన యవమానమునకు సహనము సేయుదును. నా భారత జాతికిఁగల యవమానమును సహింపను. కనుక నా పోలీసు వానిపై నీవు నా కేల పోనిమ్మని ఈ ధీరామృత వచనములకు భగవానునకు ప్రణమిల్లి ఆ తావు నుండి కదలిపోయెను.

వేఖాకస్తూరి గాంధి తన యాలుఁ బిడ్డలతో భారతదేశము నుండి ఓడలో పయనమై దక్షిణాఫ్రికా పోవుచుండెను. మఱి యొక ఓడద్వారా నా సమయముననే అక్కడకు పోవుచుండెను. ఆ రెండు ఓడలయందును రమారమి ఎనిమిది వందలమంది బాటసారు లుండిరి. వీరందరను గాంధి వెంటఁబెట్టుకొని వచ్చుచున్నాఁడని దక్షిణాఫ్రికాలోని తెల్లవార లనుకొనుచుండెను. ఆ దేశములోనికి భారతీయులను దిగుమతిచేసి తెల్లవారి లాభములు కాజేయ సంకల్పించినాఁడని యాతనిపైఁ దెల్లవారికి పట్టరాని కోపము వచ్చెను. అతనిపై కోపము గలుగుటకు మఱియొక కారణముకూడ కలదు. అతఁడు భారత దేశమునకు వచ్చి తెల్లవారు చేయు దురాగతములను ఉన్నవి ఉన్నట్లుగా చాటెను. వానికి పదివేల ప్రతులు వేయించి పంచిపెట్టెను. నగర నగరములలో మహాసభలు జరిగెను. ఈ వార్త దక్షిణాఫ్రికాలోని తెల్లవారికి

చెప్పెను. ఇంక చూచుచున్నను, వారికిఁగలిగిన కోపము, ఎక్కువ గాంధిని మ్రింగుదుమాయని వారు కనిపెట్టుకొని యుండిరి. ఈ జాడ అతనికి తెలియదు.

ఇట్టి సమయమున నతఁడు ఆలుబిడ్డలతో ఓడలో పయనమై దక్షిణాఫ్రికా పోయెను. ఆ సమయమున అతని చంపుటకు తెల్లవారు గుంపులు గుంపులుగా రేవులోనికివచ్చిరి. ఈ సవ్వడి కనిపెట్టి ఓడ, రేవులోనికి రానేలేదు. అటువెనుక నతఁడొక చెలికాని ప్రేరణచే రేవులో కాలు మోపెను. తన యాలుబిడ్డల నొక మిత్రుని యింటికిఁబంపివేసెను. అనంతరము తానును తన చెలికాడును కలిసి సాయంసమయమున బాటను బడిపోవుచుండిరి. ఇంతలో తెల్లపిల్లలు కొందఱు గాంధిని గుఱుతుపట్టి, గాంధి, గాంధియని కేకలు పెట్టిరి. మెఱపు తీవ వలె నా వార్త నగరమంతయు ప్రాకిపోయెను. గుంపులు గుంపులుగా వచ్చి తెల్లవారు గాంధిని ముట్టడించిరి. కొందఱు రాలు, క్రుళ్ళిన కోడి గ్రుడ్లు, రువ్విరి కొందఱాతని మోదిరి. మఱి కొందఱాతని నడఁదోసిరి. కాళ్ళతో తన్నిరి. పిడికిళ్ళతో పొడిచిరి. ఆ దెబ్బలతో నాతనిశరీరము నలి నలి యైపోయెను. అతఁడొక యింటివాకిటి ఇనుప చువ్వలను బట్టికొని దేవదేవుని ధ్యానము చేయుచుండెను. ఇంకను అతనిపై రాలవాన గురియుచునే యుండెను. అతఁడు సొమ్మసిల్లి పోవుచుండెను.

ఆ సమయమున నా దేశమును నాతని కాపాడు నా దైవమా! దేవతా చక్రవర్తీ! నీవు దీనజన మందారుడవు గదా యని యతఁడు స్మరించుచున్నంతలో నొక యువతి దేవకాంతి చందమున త్వరగా నాతని రక్షించుటకై వచ్చెను. ఆమెను చూచి గుంపులోని తెల్లవారు జిల్లపడిరి. కొందఱు కాలు మరలి పోయిరి. కొందఱు దిగ్భ్రమము నొందుచుండిరి. జాలగారు మూగి పోయినది.

ఆమె, పోలీసు సూపరింటెండెంటు అలెగ్జాండరు సతీమణి. ఆమె గాంధికి గొడుగు పట్టి తన వెంట నాతని పోలీసు ఠాణాకు క్షేమముగఁ దీసికొనిపోయెను. గుంపంతయు తరలిపోయినది. గాంధి యింక ఉపద్రవము లేదనుకొని తన యొక్క బిడ్డలున్న చెలికాని మందిరమున కరిగెను. తిరిగి రాత్రి సమయమున తెల్లవారు వేనకు వేలుగా వచ్చి ఆ యింటిని ముట్టడించిరి. ఆ తెల్లజాతి వారిలో ఆ రేయి గలిగిన సంచలనము తుపాను గాలికి చేరెను. ఈ రాత్రి గాంధిని రూపుమాపెదమని వారు సిద్ధపడిరి. ఆ యింటిని తగులబెట్టుదుమని పట్టు పట్టిరి. వారి నడంచుట కెట్టి మగవారికిని వశము కాదను నటులుండెను. ఇంతలో దేవదూత యేతెంచిన పోలీసు సూపరింటెండెంటు అలెగ్జాండరు అక్కడకు వచ్చెను. లేనిచో తెల్లవారి యుద్రేకమును తన తియ్యని మాటలచే శాంతపఱచుచు, చాటుగ నిద్దఱు పోలీసులను గాంధి యున్న

మందిరములోనికిఁ బంపి, అతనికి పోలీసు వేషము తొడిగించి యాతనిని పోలీసు గార్డాను ఆ గుంపులో నుండియే తొలగించి వేసెను. అనంతరము గాంధి, మందిరమున లేకుంట పరీక్షించి ఆ దుండగులు తరలిపోయిరి. ఈ భీకరామృత దర్శనములను గాంధి భగవానుని స్మరించుకొనుచునే యుండెను.

ఈ ఉపద్రవము ఇంగ్లాండులోనున్న బ్రిటిషు దొరతనము వారికి తెలియ వచ్చెను. గాంధిని గురించి యింత ఉత్పాత మొనరించిన దుండగులను పట్టి శిక్షింపవలెనని, ఆ దొరతనము వారు దక్షిణాఫ్రికా దొరతనమువారికి వ్రాసిరి. ఈ దొరతనపు ఏజెంటు గాంధి కడకు వచ్చి, ఏమోయి! ఈ తీరున వార్త వచ్చినది. నీవా దుండగులపై కేసు తేవలసినదని సలహా చెప్పెను. అంత గాంధి, యాతనిఁ జూచి, అయ్యా! నా ప్రాణము లకు నే భీతిల్లను. నాకుఁగలిగిన యవమానములకు పగను సేయను. నా జాతి యవమానమును మాత్రము సహింపలేను. ఈ తెల్లవారు తెలియక చేసినదోసమిది. కాన నాకు కినుక లేదు. పోనిమ్మనెను. ఆ మాటలకా యేజెంటు విస్మయమొంది ఔరా! గాంధి యెంతటి సహనశీలుడు ఎంతటి నిరహంకారుడు. ఎంతటి అహింసా పరాయణుడని ప్రశంసించెను.

ఇట్టిదే ఘటనయొకటి జరిగినది. దక్షిణాఫ్రికాలో నుండఁ దలఁచిన భారతీయులందఱు ఎన్ని కొమ్ములుగల వారయినను

నరే ఆడువారును, మగవారును, తమ రిజిస్టరులలో వేలిముద్రలు వేయింపవలసినదని అక్కడి దొరతనమువారు శాసించిరి. గాంధి బ్రహ్మాండమైన యలజడిని గలుగఁజేసి యా పద్ధతి నెదిరించెను. ఇది యవమానకర మనెను. ఇట్టి పని చేయరాదనెను. ఇంతలో ఆ దొరతనమునకు ప్రధాన మంత్రియైన స్మట్సు అను సేనాని గాంధిని పిలిచి, ఏమోయి గాంధి, ముందుగా సందఱిచేతను వేలిముద్రలు వేయింపుము. తరువాత నేనా పద్ధతి రద్దుచేయించెదను. దీన నీకును నాకును గౌరవము కలుగుననెను. సాత్త్వికుఁడగు గాంధి యామాటల నమ్మెను. అందఱను వేలిముద్రలు వేయుఁడని యతఁడు ప్రబోధించెను. అతని మిత్రులే కొందఱిట్టి పని తగదు. స్మట్సు జిత్తుల మారి నక్క. నీవు వట్టి అమాయకుఁడవు. అతనిమాట నమ్మరాదు. నీకీర్తి మంటగలసిపోవుననిరి. గాంధి అట్లయినచో, మన సత్యాగ్రహాయుధము మనకడ లేదా. మనకేమి జంకు. అతనిమాట యాతనికే దక్కును. మీరభయపడవలదు. నేను మిమ్ము తిన్నఁగదానిని నడపించెదను. నమ్ముఁడని ఆ మిత్రుల నతఁడు శాంతపఱచెను. వారు సరే యనిరి. కాని అట్టి మిత్రులలో మీర్ ఆలమ్ అను పఠానువాఁడొక డుండెను. అతఁడు గాంధిని దేవునివలె కొలిచెడువాఁడే. కాని గాంధి నడవడిలోని యీ తారతమ్యము నతఁడు గ్రహింపలేక పోయెను. గాంధి నట్టి మోసగాఁడని యతఁడు తలఁచెను. కనుక గాంధి వేలిముద్ర

వేయుటకు [illegible] పోవుచుండఁగా, ఆపఠాను వెనుకనుండివచ్చి యాతని తలపై కఱ్ఱతో నొకబలమైన పెట్టు పెట్టెను. మఱికొన్ని దెబ్బలు మొగముపైనను వెన్నుపైనను మోదెను. గాంధికి తెలివి తప్పెను. అతని ముందు పండ్లు విఱిగిపోయెను. ఒడలంతయు నెత్తుటితో తడిసిపోయెను. గాంధి మిత్రులందఱు ఎంతదారుణ మనిరి. తెల్లవారు సయితము కంట తడిపెట్టిరి. వారు గాంధిని ఒక మతాచార్యుని యింటికిఁ గొంపోయిరి. ఆ యాచార్యుఁడును అతని సతీమణియు నాతని దేహోపచారముల సేవించిరి. తెలివి వచ్చినపిదప గాంధి తానే మొదటగా సర్కారు రిజిస్టరులో వేలిముద్ర వేసెను. అతని యనుచరులతని ననుసరించిరి. అనంతరము స్మట్సు సేనాని తనమాట నిలుపుకొనలేకపోయెను. అంతట గాంధి దొరతనమువారు తనకిచ్చిన ఆజ్ఞాపత్రము లన్నియు మంటలోఁ గాల్చివేసి వారితో సత్యాగ్రహ మొనరించెను.

కొందఱు మిత్రులు గాంధి కడకువచ్చి మీరా ఆలమ్‌పై కేసు పెట్టుమనిరి. గాంధి వారితో, అతని కేమి తెలియును; చేయు చేయుచున్న దంతయు పొరపాటని యెఱుఁగఁజాలెను. అతఁడట్లో యెఱుఁడు; అతని శిక్షింపఁజేయ నొల్లననెను. కాని, తెల్లవారు దొరతనమువారిని పేరికేని నట్టి నడుమఫెలో జరగిన దూరపావమని. గాంధి సైచినను మేము దీని సైపమనిరి. అంత ప్రభుత్వమువారు గాంధితో పనిలేకయే మీరా ఆలమ్‌పై కేసుమోపి [illegible]

ములు శిక్ష విధించిరి. దానికి గాంధి చాల దుఃఖించెను.

దక్షిణాఫ్రికా దొరతనమువారు భారతీయుల ననేక విధములుగ హింస పెట్టిరనియు, ఆ బాధానివారణకై గాంధి భారతీయుల పక్షమున నిలిచి వారితో చిరకాలము పోరెననియు ముందే వివరించితిమి. ఆ పోరాటమునకే సత్యాగ్రహమని పేరు. సత్యము, అహింస, ధర్మము [illegible] నాధారపడి వినయవంతుడై తాను దెబ్బతిని, ఎదిరిని పొడువక, తాను గాసిచెంది, ఎదిరిని గాయపరుపక, తాను హింసచెంది, ఎదిరిని హింసింపక, తన పట్టువిడక, తన ధర్మమును విడువక ప్రాణము లర్పించు క్రమమే సత్యాగ్రహము. దీని నింతకు పూర్వ మనుష్ఠించినవాఁడెవ్వఁడు, ఇఁక ననుష్ఠింపఁబోవు వాఁడెవ్వఁడు. అధర్మమును నిర్మూలించుకొనుటకు వెలికిఁదీసిన ఈ సాధనము ఒక్క గాంధిచేతి పాశుపతాస్త్రమనుటయే. దీని కపజయ మెన్నటికిని లేదు. ఇట్టి పోరాటమునకు గాంధి ప్రజానాయకుఁడు. అటు దొరతనమునకు స్మట్సు సేనానాయకుఁడు.

ఆ దొర, గాంధిని వలలో వేసికొనుటకు వేయి యుపాయములు పన్నెను. గాంధి ఆ వ్యూహములను ఛేదించుటకు కోటి యత్నములు చేసెను. స్మట్సు, ఆ పోరున గాంధి యనుచరులను పదివేల మందిని చెఱసాలలో పెట్టించెను. [illegible] నైదవ

చేయించెను. కొందఱ పురుషులను షూటుచేసి కాల్చి చంపిం
చెను. గాంధిని చెఱలోనుంచి నానా విధముల బాధింపజేసెను.
ఇంత చేసినను గాంధి లొంగ లేదు. కొలిమిలో వేసిన బంగారము
వలె అతఁడంతకంతకు కాంతిమంతుఁడై వెలుఁగఁజొచ్చెను. ఆ
దినములలో స్మట్సుదొర దర్శనమునకై గాంధి దరఖాస్తు పెట్టు
కొనఁగా అది గైరుమంజూరు చేయఁబడెను. ఇట్టి స్మట్సునను
సహించి గాంధికి కినుక యుండవలదా! కాని అతనికి కలనైన లేదు.
అతఁడహింసాపరాయణుఁడు. ప్రేమమూర్తి. అతఁడు స్మట్సు
విధించిన జైలులోఁ గూరుచుండి, ఆ స్మట్సు నేనాళ్లకో అతని
బంగారు చెప్పులు తాను స్వయముగా కుట్టి, తాను విడుదల
యయిన వెనుక అతనికి తీసుకపోయి అతని పాదములకు తొడిగి
నాఁడు. అది చూచి స్మట్సు తెల్లపోయినాఁడు. ఏమిరా! ఈ
గాంధి మానవుఁడా! ఏసుక్రీస్తు అపరావతారమా యని యతఁ
డాశ్చర్యము పొందినాఁడు. ఆ గాంధి కుట్టిన చెప్పులు తొడు
గుట కధికారము లేనివాఁడను. అతఁడెక్కడ, నేనెక్కడ యని
నేఁడా స్మట్సు వాపోవుచున్నాఁడు.

ఇట్లు గాంధి అహింసావ్రత దీక్షాధురంధరుఁడై కోటి
కష్టములు తాననుభవించి పుటము పెట్టిన బంగారమువలె
తేజరిల్లుచు, తన కపకారము గావించిన వారి కుపకారము
గావింపుచు, సత్య స్వరూప సందర్శనమునకు వారిని తనతో
సాధకులుగా నొనరుచుకొనెను.

పంద్రెండవ ప్రకరణము.

అనాథ రక్షణము.

దీనులను గాపాడుట భగవానున కెట్టి గుణమో యాతని దాసులకు నట్టిది. ఒకనాఁడు బాల సుందరమను వలస కూలి గాంధి కడ కేడ్చుచు వచ్చెను. ఆతని ముందటి పండ్లు విఱిగి నెత్తురు కాఱు చుండెను అతఁడు తన యజమానుఁడైన తెల్ల వాఁ తన్ను చావ మోది తనకీ గతి కలుగఁ జేసెనని, గాంధితో చెప్పుకొని వవవి వవవి దుఃఖించెను. గాంధి మనస్సు కరగి నీరయి పోయెను. అతఁడా కూలి వానిని డాక్టరు వద్దకుఁ గొనిపోయి చికిత్స చేయించి, సర్టిఫికెట్టు పొంది, ఆ తెల్ల వానిపై కేసు దాఖలుచేసి తానా కేసులో పని చేసి గెలిచెను. ఆ కూలివాఁడు వేఱొక యజమానుని కొలువులోఁ జేరెను. ఇట్టిది యపురూపమని వలస కూలీలు తలఁపోయ సాగిరి. నాఁటి దినము నుండి గాంధి ఆఫీసు లోనికి, వలస కూలీలు గుంపులు గుంపులుగా వచ్చుచు తమ కష్టముల నాతనికి విన్న వించుకొనుచు అతని సహాయమువలన వాని నుండి విముక్తి పొందు చుండిరి.

ఇట్లుండ నొక తఱవ దక్షిణాఫ్రికా సూదేశములలో ప్లేగు రోగము వ్యాపించెను. వెంటనే గాంధి, స్వయం సేవక

దళమును గూర్చుకొని రోగుల కడకేగి వారి ననేక విధముల సేవించెను. ఇట్లే బొంబాయిలో నొకసారి ప్లేగు వ్యాపించెను. ఆ సమయమునను అతడు కొందఱ యనుచరుల గూడుకొని, మందిరములలోని ముఱికికి నెత్తి పాఱవేయుచు, మఱుగు దొడ్లను పైతను స్వయముగా బాగు చేయుచు, రోగులను సేవించుచు ప్లేగు నివారణమునకు దోడ్పడెను. నేటికిని అతడు కుష్ఠ రోగులు మొదలగు దీనులను సేవించుచునే యున్నాడు.

దక్షిణాఫ్రికాలో తాను బారిష్టరుగా పని చేయుచున్న కాలములో ఒకనాడొక డాక్టరు కడకు పోయి, అయ్యా! నాకు తీఱిక సమయమున్నప్పుడు ఈ ఆసుపత్రిలోనికి వచ్చి రోగులను సేవించుట కనుమతి యిండని దాని నడుగు కొని విరామము లేకుండ దీనులను సేవించెను. ఇట్లతడు ప్లీడరీ చేసినను అనాథ సేవయే చేయుచుండెను.

ఒకసారి దక్షిణాఫ్రికాలోని ఇంగ్లీషు వారికిని, డచ్చి వారికిని యుద్ధము సాగెను. దానిలో గాయపడినవారికి సేవ చేయుటకు గాంధి తానొక వాలంటీరు దళమును గూర్చుకొని ప్రభుత్వమువారి యనుమతిపొందెను. అతడు ఫిరంగుల్లు మ్రోగుచున్న తావులకు సయితము తన యనుచరులతో పోయి గాయములు తగిలి దిక్కులేక పడియున్న సైనికులను డోలీలలో ఆసుపత్రులకు చేర్చుచుండెను. అతడు దినమునకు ఇరువది యిరువదియైదు మైళ్ళ పొడవున నిండుమనుష్యులను డోలీలలో మోసికొని నడచుచు

వరుసగా కొన్ని దినములవరకు ఆసుపత్రులకు జేర్చుచుండెడివాఁడు. రామా! ఎంతికష్ట మెంతికష్టము. గాంధి భుజములు కాయలు కాసియుండునుగదా! పైని దేవతలు గాంధి సేవను జూచి యబ్బురపడి యుండరా!

మఱియొక తూరి దక్షిణాఫ్రికాలో జూలూల తిరుగుబాటు వచ్చినది. దొరతనము వారు వారిని వేటాడి పట్టి చంపుచుండిరి. మఱల గాంధి రక్షక దళమును గూర్చుకొని, దొరతనము వారి యనుమతి పొంది, ఆ కొండ జాతివారిని సేవింప నడుము కట్టుకొనెను. అతఁడందును అపారమగు సేవ గావించెను. సూర్యుని యరద మొకప్పుడైన నిలిచి విరతి చెందిన చెందవచ్చును గాని గాంధి సేవా రథము మాత్రము విశ్రాంతి నెఱుఁగదు.

పదుమూఁడవ ప్రకరణము.

ఆశ్రమ జీవితము.

దక్షిణాఫ్రికాలో నుండఁగా గాంధి (అంటు డి లాస్టు) సర్వోదయమను చిన్న పొత్తమును చదివెను. దానిని వ్రాసిన వాఁడు రస్కిను మహాశయుఁడు. ఆ పొత్తమును చదివి గాంధి పరమ పరితోషమును పొందెను. దాని నుండి యతఁడు మూఁడు ప్రధానాంశములు నేర్చెను.

౧. జీవితమంతయు ప్రజాసేవకొరకే వినియోగింపవలెను.

౨. సమాజములలో, సామ్రాజ్యము పాలించు మహామంత్రియు, చెప్పులు కుట్టువాఁడును సమానాధికము పొందఁదగినవారు.

3. వృత్తు లన్నిటిలోను కర్షకునిది, కార్మికునిది ఉత్తమములు అని. మొదటి రెండు విషయములు గాంధీకి మున్నెన్నఁడో తెలిసిన విషయములే. కాని మూఁడవది అతని కపూర్వము: అది అతనికి మిక్కిలి రుచించెను

వెంటనే ఫినిక్సు అను పట్టనమునకు సమీపమున ఎనుబది యెకరముల భూమి కొని అతఁడచ్చోట నొక యాశ్రమము నెలకొల్పెను. అతఁడంత కర్షకుఁడై తన జీవితము గడప బూ కొనెను. ఆ కాలమున నతఁడు "ఇండియను ఒపినియను" అను పత్రికను ఇంగ్లీషున నడపుచుండెను ఆ పత్రిక అచ్చుకూటములను ఆ యాశ్రమమునకే చేర్చెను. అతని యనుచరవర్గమును ఆఁడు బిడ్డలును ఆశ్రమమునం దన్ని పనులు చేయుచుండిరి. వీను లూడ్చుట, దొడ్లు బాగుచేయుట, చెప్పులు కుట్టుట, చాకలి మంగలి పనులు, వడ్రంగము, పందిళ్ళు పాకలు వేయుట. పాదులు త్రవ్వి యేతా మెత్తుట, నాగలి దున్నుట, పాలుపని మొదలైన పనులన్నియు అతఁడు స్వహస్తముగా నేర్చెను.

ఒకసారి ఆతఁడు స్వయంసేవకుఁడై తాను స్వయముగా చెప్పులు కుట్టి గాంధీకిచ్చెనని లోగడ చెప్పి యుంటిని గదా! ఇంక నాతని చాకలిపనిని గురించి వినుఁడు గాక! ఒకప్పుడు దక్షిణాఫ్రికా స్థితిగతులు తెలిసికొనుటకు గోపాలకృష్ణ గోఖలే యక్కడకు పోయెను. గాంధి యతనికి దేవతాభావముతో స్వాగతమిచ్చి యాతనిని సత్కరించెను. గోఖలే యొద్ద నొక రుమాలుండెను. అది యతనికి తన గురువైన మహాదేవ గోవింద రనడేనుండి కానుకగా వచ్చినది. దానిని గోఖలే గొప్ప యాదరముతోఁ జూచుకొనుచుండెను. ఆ సమయమునకు అది మాసి యుండెను. దానిని బాగుచేయింపవలెనని గోఖలే తలఁచెను. కాని దక్షిణాఫ్రికాలోని తెల్ల చాకళ్ళు నల్లవారి బట్టలనుదుకరని యాతని కేమి తెలియును. అంతట గాంధి గోఖలేకడకు పోయి, అయ్యా! నేను మీ రుమాలును చక్కఁగా నుదికి బాగుచేయఁ గలననెను. "నా కిప్పుడు నమ్మకము" అనుచు గోఖలే, "ఓయి గాంధీ, [illegible] బారిష్టరువని నీకు కేసుల నొప్పగింప గలనుగాని, నేర్పరివగు చాకలివని రుమాలు నెట్లొప్పగింతునోయి!" యనెను. అంతట గాంధి అయ్యా, మీరు నన్ను నమ్మి రుమాలు నిప్పింపుడు. నా పనితనము మీరు చూడఁగలరనెను. ఎట్లో గోఖలే తన రుమాలును గాంధి కిచ్చెను. అతఁడు దానిని సర్వోత్తమముగా బాగుచేసెను. గోఖలే దాని నందుకొని శెబాసు,గాంధీ! శెబాసు గాంధీ! నీవు తగిన పనితనము గల

పెంచుకొని మారిపోయెను. నేను గోపాలకృష్ణ గోఖలేనుండి
సర్టిఫికెట్టు నొందిన [illegible] చాలిలను గాంధి గర్వించినాడు.

గాంధికి నలుగురు కుమారులు. హరిలాలు, మణిలాలు
[illegible] పుట్టినవారే. రామదాసు, దేవదాసు దక్షి
ణాఫ్రికాలో పుట్టిరి. ఈ చివరి ఇద్దరు. [illegible]
కొనెను. ప్రసూతి విషయములు గల పొత్తములతడు మున్నే
చదివి యుండెను. బిడ్డలకు స్నానము మున్నగునవి తానే
చేయించు చుండెను. ఇల్లుతుడుచు ఇంటిపనులు చూచుకొను
చుండెను. అటు కోర్టునకు పోయి బారిష్టరీ చేయుచుండెను.
దక్షిణాఫ్రికాలో నున్నంతకాలమతడు ప్రాక్టీసు మానలేదు.
ఇంతలో నతనికి దక్షిణాఫ్రికా దొరతనమువారితో సత్యా
గ్రహము ప్రారంభమాయెను. అతని యనుచరులు శాసనము
[illegible] చుండిరి. జైళ్లకు పోవుచుండిరి. విముక్తుల యగు
చుండిరి. మరల జైళ్లకు పోవుచుండిరి. [illegible]
[illegible]
గలదు. గాంధి [illegible] ఆ [illegible] పోషింప
గలడు. అందుచే నతనికి కొంతకాల మేమియు తోచకపోయెను.
చివర కాతని కొక [illegible] ఆలోచన పొడగట్టినది.
[illegible] అను పత్రము [illegible] మాతమున
[illegible] పాటించుచు [illegible], అతడు
[illegible] అను పేరుతో నొక [illegible]

నిర్మించెను. ఇత డిచ్చట ఫినిక్సు ఆశ్రమము నుంచెను. తాను జైలునకు పోయిన సత్యాగ్రహుల కుటుంబముల పోషించుచూ టాల్‌స్టాయి ఫారము నుంచెను.

ఈ కాలమున గాంధి పడిన కష్టములకు మితిలేదు. అతఁడు ఉదయమున లేచి తోటపని, దొడ్డిపని చేయుచుండెను. రెండు జాములకు బువ్వ వండవలెనే యాశ్రమములోని బాలబాలికలకు బడిపంతులపని, సాయంకాలము పొలముపాటు చేయుచుండెను. ఇది యిట్లుండగా తఱచు కోర్టుపనిమీఁద జానుబర్గు పోవుచు వచ్చుచుండెను. ఆతఁడు దినమునకు నలుబది మైళ్ళవఱకుగా నడచుచుండెను. ఒకనాఁడతఁడు కాలినడకను ఏఁబదియైదు మైళ్ళు పయనము సాగించెను. ఆహా! అతఁడెంత కష్టజీవియోగదా!

మఱియొక చిత్రము. ఆశ్రమవాసులందఱును పనులు చేయవలసినదే. వారందఱున్ని కులములవారు, అన్ని జాతులవారునై యుండిరి. గుజరాతీలు, అరవలు, తెలుగులు, క్రైస్తవులు, హిందువులు, ముసల్మానులు, ఆంగ్లేయులు, జర్మనులు ఉండిరి. ఆడువారు, పడుచులు, ముసలులు, బాలకులు నుండిరి వీరందఱ కొక్కటే పాకశాల. గాంధి యాడజనొక్కరే ప్రక్కన నీళ్ళు తొలిగించుచుండెను. ఇట్లు ఏండ్లు నడచెను. ఎంత ధనము వచ్చుచుండెనో, ఎంత వ్యయమగుచుండెనో దానికి

పై సలహాతోపాటు లెక్క ఎప్పటికప్పుడతఁడు సిద్ధముగా నుంచుచుండెను. ఇట్టి యసాధారణ కార్యము సాధించుటకు ఋషియగు గాంధీకే చెల్లినది గాని యితరులకు సాధ్యమా! ఈ విధముగా నతఁడు శ్రమజీవితము గడపుచు, కాయలు, దుంపలు ఆరగించుచు, నేల పరుండుచు, దీనజనసేవ చేయుచు, దొరతన మువారి యధర్మము నెదిరించుచు, తాను నియమవంతుఁడై బ్రహ్మసాక్షాత్కారము చేయుచుండెను.

అతఁడు దక్షిణాఫ్రికా సమరమున గెలుపొంది భారత దేశమునకు తిరిగి వచ్చెను. రాఁగానే యతఁడు గుజరాతులోని అహమ్మదాబాదు నగరమునకు సమీపమున సబర్మతి నది యొడ్డున సత్యాగ్రహాశ్రమము నెలకొల్పెను. అతఁడందు పదు నైదు వత్సరములు వసించెను. పలుకులో, చూపులో, తలఁపులో, నడకలో సత్యము ననుసరింపవలెను. ఏ జీవ జంతువు నైనను ఏవిధముగాను హింసింపరాదు. అధర్మము నెదిరించుటకు సమ్రాజమునకుగాని, రాజునకుఁగాని భయపడరాదు. తనకు కావలసిన వస్తువులకంటె నధికము నుపయోగింపరాదు. స్వదేశ వస్తువులనే యుపయోగింపవలయును. జాతి కుల మత భేదముల పాటింపక అందఱను ప్రేమింపవలెను. అను నీ మొదలగు నియమములతో సత్యాగ్రహాశ్రమమును దీక్షతో నడపెను.

అనంతరమతఁడు ఇప్పటికి పదునైదు వత్సరములనాఁడు దాని విడిచి, వార్ధా నగర సమీపమున సేవాగ్రామమను జనపద

మున ఆశ్రమము నిర్మించమని పై నియమములతోనే ఈశ్వర సంకల్పాన మోక్షప్రాప్తికై చూచుచున్నాడు.

పదునాల్గవ ప్రకరణము.

పట్టుదల

గాంధీకి పట్టుదల మెండు. ఒకసారి అతని సతీమణి కస్తూరీబాయికి పుట్టెడు జ్వరము వచ్చినది. ఆమెను ఆసుపత్రికి చేర్చిరి. ఆ రోగము కాలక్రమమున పెరుగజొచ్చెను. ఆమె నీరసించిపోయెను. అంత డాక్టరు గాంధీనిచూచి, ఏమోయి గాంధీ, నీ భార్యకు మాంసపురస మిచ్చినగాని యారోగ్యము కలుగజాలదు. నీ శాకాహార నియమములు మా వైద్యుల లెక్క పనికిరావు. నీ పట్టుదలయే ప్రధానమగుచో నీభార్య గతి యేమగునో చెప్పజాలను. నా పద్ధతి నీకనంగీకారమగుచో, నీ భార్యను మాయాసుపత్రినుండి తొలగించుకొని పొమ్మనెను. వెంటనే గాంధీ, చిత్తమని, లారీ తెప్పించి, ఆపదలోనున్న తమ యిల్లాలిని ఆసుపత్రినుండి కొంపోయి, భగవంతునిపై భారము వేసి, ఆమె యారోగ్యమును తానే కుదుర్చుకొని తన శాకాహార నియమము నిలుపుకొనెను.

ఒక తడవ ఆ దంపతులకొక మాట పట్టింపువచ్చినది. గాంధీ కస్తూరినిగాంచి, అవునుగాని, నీయారోగ్యము [illegible]

నారదుటలేదుగదా! నీవు ఒక ఏడాదివఱకు ఉప్పు వాడరాదని వైద్యులు పలుకుచున్నారు. దానికి నీవేమందువనెను. అంత, కస్తూరీదేవి, మంచిమాట సెలవిచ్చినారు. నేనీ కఠిన పథ్యములు చేయలేక కమిలి పోవుచున్నాను. ఉప్పు లేని చప్పిడి కూరలు తిని నేను వేగలేను, నను బాధింపకుడనెను. పిదప గాంధి, అట్లయిన వినుము. నేనొక్క రేడాదివఱకు ఉప్పు ముట్టను. నీవు ఉప్పు తిన్నను సరే, పప్పు తిన్నను సరే, నాకేమియు పని లేదనెను. ఆమాటలు విని కస్తూరీదేవి, నెత్తి నోరు మోదుకొని ఏమి పాపము? నేనే నోరు కట్టుకొని యేడాదివఱకు ఉప్పు లేని కూరలు తిందును. మీరు మీ ప్రతిన చాలించుకొండని వేడుకొనెను. గాంధి యందుల కంగీకరింప లేదు. మీరు మొదటి నుండి పెంకెవారని తెలిసి యుండియు నే నవివేకముతో వర్తించుట నాదే తప్పని కస్తూరీదేవి చెంపలు వేసికొని మిన్న కుండెను. కాని గాంధికి తన సతీమణి యందుఁ గల ప్రేమను గుఱుతింపఁ గలిగిన వారెవ్వరు.

రెండవ రౌండు టేబిలు సమావేశము ఇంగ్లాండునందు జరిగి నప్పుడు గాంధియు వచ్చేసి కలిసెను. రాజకీయములను గుఱించి ఆలోచనలు జరిగినవి. హిందూ సమాజమునుండి హరిజనులను విడదీయు యత్నములు జేసెదరని కొందరు మంత్రులు పలికినారు. అట్లే మీరొనర్చినచో నాప్రాణము లడ్డు వేసి ఆ ప్రయత్నముల నెదుర్కొందునని గాంధి పలికెను.

మాగ్డొనాల్డు అను మహామంత్రి యెంత వాఁడో, అతఁడు
గాంధి మాటలు సకకు గొనక హరిజనులను హిందూ సంఘము
నుండి విడఁదీసెదనని ప్రకటించినాఁడు.

ఆనాఁడు గాంధి చెఱసాలలో నుండి, ఈపద్ధతి
రద్దగు వఱకు ఉపవాస దీక్షలో నుందును. ఒక వేళ
ఇది రద్దు కాదేని, ఉపవాసము తోడనే మరణింతును గాక యని
ప్రకటించెను. దానితో భారత భూమి కంపించి పోయెను.
కులాచలములు కదలఁబారెను.

పండిత మదనమోహనుఁడు, అంబేద్కరు మున్నగు కర్మ
వీరులు పూనా నగరమున సమావేశమై హిందూ సమాజము
నేకముగా నుంచు కొనుటకు ఆఱు దినములలో సమాధానము
కుదుర్చుకొని మాగ్డొనాల్డునకు తంతి నియ్యఁగా, సతఁడు
తాఁ గావించిన ఏర్పాటును రద్దు చేసెను. అతఁడు కన్నులు
విచ్చి చూచి, ఏమిరా గాంధి తేజము. బ్రిటిషు సామ్రాజ్యము
వేసిన ముగ్గును ఆఱు దినములలో చెఱిపి వేసిన వాఁడీతఁడెంత
దిట్టరా యని యబ్బుర మందినాఁడు. గాంధికి హరిజనుల
యందెంత వాత్సల్యమో భారతీయులు గుర్తింపఁ గలిగిన
వారయిరి. అతఁడు తన నియమముల గుఱించి యెంత
పట్టుదల కలిగి యుండునో దానిని తెలిసి కొనఁగలిగిన
వాఁడెవ్వఁడు.

దేవదేవుని తోడుపాటు.

అన్నియు విడిచి నన్నే నమ్ముకొన్న వానిని అన్ని విధముల కాపాడుదు నని దేవదేవుఁడు గీతలో చెప్పిన మాట గాంధి ప్రతి రక్త బిందువునందును జీర్ణించి యున్నది. అతఁడన్ని వస్తువులందును ఈశ్వరుని చూచుచుండును. అన్ని పనులందును దయామయుఁడే తన్ను ప్రేరేచు చున్నాఁడని నమ్మి యుండును. నా [illegible] లేకుండఁ జేసినను జీవింపఁగలను గాని, దేవదేవుని నానుండి దూరము చేసిన ఒకక్షణ మైనను జీవింప లేనని అతఁడు చెప్పుకొనుచున్నాఁడు. అతఁడెల్ల వేళలను ఈశ్వరుని ధ్యానించుచుండును. ఆ ధ్యానమందలి రుచి, ఆనాఁడు ప్రహ్లాదాదులకు, పరమహంసలకు తెలిసినది. గోపన్నకు, పోతన్నకు, త్యాగయ్యకు తెలిసినది. ఈనాఁడు గాంధికి తెలిసినది. అతఁడన్ని పనులను భగవానునిపై భారము మోపి చేయుచుండును. అతఁడన్ని వేళల తన్ను కాపాడు చుండునని అతఁడు నమ్మి యుండును.

ఒకప్పుడతని రెండవ కుమారుఁడయిన మణిలాలునకు సన్నిపాత జ్వరము వచ్చినది. గాంధి పూర్వదినములలో అందఱును నీటి చికిత్సవంటి చికిత్స చేయుచుండెను. అందువలన అతఁడు, పెద్ద జ్వరము వచ్చి పడియున్న తన [illegible]ని, శరీరమునకు కూడ తడిగుడ్డలు చుట్టఁబెట్టినాఁడు.

జ్వర మింకను పెరుగుచున్నదిగాని తగ్గుచుండుట లేదు. తాను లోకులకై, యే వైద్యము సాధించు చున్నాఁడో, దానినే యతఁడు, సత్యపాలకుఁడు గనుక, తన కుమారుని పైనను నెఱపె యున్నాఁడు. కాని యాపద సంభవించు నటు లుండెను. అతఁడేమి చేయఁగలఁడు. ఱోటిలో తల దూర్చి రోకటి పోటునకు వెఱచి ప్రయోజన మేమి. ఆపత్కాల ము దీశ్వర ధ్యానమే పరమౌషధమని యెంచిన వాఁడయి బాలకుని భవితాశ వదలి భగవన్నామము చేసికొనుచు పోయి యెక్కడనో ఏకాంత చింతనచేసి తిరిగి వచ్చెను. ఇంతలో బిడ్డని జ్వరము చెమటతో తీసివేసినటుల తగ్గిపోయినది. మణిలాలు తండ్రిని, నాన్నా, నాన్నా, యీ గుడ్డలు తీసివేయుము. నాకు చెమట పట్టియున్నది. ఈ గుడ్డలలో నే నిలువలేననెను. తండ్రి యాగుడ్డలు తీసివేసెను. బాలకుని జ్వరము శాంతముగా తగ్గి పోయినది. గాంధి, దయామయుఁడగు భగవానునకు కోటి కోటి దండములు పెట్టుకొనెను.

గాంధి దక్షిణాఫ్రికా దొరతనమువారితో [illegible] నాయత్తుఁడయ్యెను. అతని నమ్మి వేలకొలఁది కుటుంబములు అగ్నిలో దుముకనున్నవి. వారి నందఱను పోషించు భారము గాంధిది. అతఁడు వారి నెట్లు పాలింపఁగలఁడు. చేత నొక కాసయినను లేదు. అతఁడప్పుడంటకే పరాత్పరుని [illegible]. ఓయి దయామయుఁడా [illegible] [illegible] [illegible]

నుండి గాంధికి తంతి వచ్చినది, రగస్ జాత్రా యను పత్రిక పుంగవుఁడు యిరువది యైదు వేల రూపాయలు పంపినాఁడు. గాంధి దానిఁ బుచ్చుకొని భగవానుని కృపా విశేషమునకు ఆశ్చర్యమంది యాతనికి ప్రణతిఁ బొనరించెను.

మఱియొక తడవ గాంధి సబర్మతి యాశ్రమము నడపుచుండఁగా సిట్టి యిక్కట్టు కలిగినది. పూటకు రెండువందల మందికి అన్నవదుపాయము జరుగవలెను. ఒకనాటి పనులయందున పైకము సాంతముగా నయిపోయినది. తినుబండారములు తీఱిపోయిన వని యతనికి తెలియవచ్చినది. అతఁ డేమి చేయఁగలఁడు. దయామయుఁడు కలఁడుగదా యనుకొనుచుండ నింతలో అహమదాబాదు నగరమునుండి అపరిచయుఁడగు వర్తకుఁ డొకఁడు మోటరుమీద గాంధి కడకువచ్చి, పూజనీయుఁడా, ఈ పదునైదు వేల రూకల నందుకొని నన్ను ధన్యునిఁ జేయవే యని వేఁడుకొని, అతనికాసొమ్మిచ్చి వందన మొనరించి వెడలిపోయెను. గాంధి ఆ పైకమందుకొని, భక్తపారిజాతమా! ఈ దాసులను పోషించుచు భారము నీపైననే వేసికొన్నావుగదా! యని నుతియించెను.

పదునేడవ ప్రకరణము.

స్వదేశము.

గాంధి కళ్ళు కొలువలె సంపన్నుఁడు. దేశమాత సత్కారము. జాతిను లోకమునందలి సందేశమునకు ఈనాఁడు ప్రపంచమునకు నన్ని

దేశములలోను కపటవర్తనము పెచ్చుపెరిగి పోయినది. అధర్మ
మును, అశాంతియు పెరిగినవి. ఈ యవగుణములను యంత్ర
ములు పెంచినవి. ఈ యంత్రములను నిర్మూలించినగాని దోపిడీ
యాగదు. ఈ రైలు యంత్రములు మూలఁబడినచో నేనొక్క
కన్నీటి బొట్టయినను విడువనని గాంధి చెప్పియున్నాఁడు. కావున
నతఁడు యంత్రపిశాచమును వదలించుటకే గ్రామ పరిశ్రమలని
యెలుగెత్తి చాటుచున్నాఁడు. ప్రపంచమున నీనాఁడావరించిన
అజ్ఞానమునకు, అధర్మమునకు, అన్యాతురతకు యంత్రములే
కారణమని యతఁడు నమ్మినాడు. ఆ యంత్రములు నశింపఁ
జేయుఁడు. చేతిపనులు చేపట్టుడు. ధర్మ జీవనము మీకబ్బును.
సత్యజీవనము మీకబ్బును. పెద్దలయెడ వినయము కలుగును.
అంత జ్ఞానోదయము కాఁగలదు. ఈశ్వరుఁడు సంతసింపగలడని
యతఁడు మాటిమాటికి చాటుచుండును కనుకనే యతఁడు
ప్రజలను గుఱించి సత్యదీక్ష నవలంబింపుఁడు. ధర్మవంతులుకండు
అహింసావ్రతము నవలంబింపుడు. చేతిపనుల నుద్ధరింపుడని
పదే పదే బోధింపుచుండును.

పదునేడవ ప్రకరణము.

వైష్ణవుఁడు

గాంధి నిజమైన వైష్ణవుఁడు. ఎవఁడు పరపీడను
గుర్తించునో వాఁడే వైష్ణవుఁడు. ఎవఁడు నింద చేయఁడో వాఁడే
వైష్ణవుఁడు. ఎవఁడు సమదృష్టి గలిగియుండునో వాఁడే

వైష్ణవుఁడు. ఎవఁడు పరస్త్రీలను తల్లులవలె నెంచునో వాఁడే వైష్ణవుడు. ఎవడు కోరికలను విడుచునో వాఁడే వైష్ణవుడు. ఎవడు మోహమాయలో చిక్కక దృఢ వైరాగ్యము గలిగి యుండునో వాఁడే వైష్ణవుడు. ఎవఁడు కామము క్రోధము జయించి కపటములేనివాఁడుగా నుండునో వాఁడే వైష్ణవుఁడు. ఎవడు రామనామ జపము గావించుకొనుచు, రామభజనము చేసికొనుచుండునో వాఁడే వైష్ణవుడు. అని వ్రాసిన నరసింహా మెహతా గీతము గాంధికి మిక్కిలి ప్రియమైనది. ఈ నాటికి గాంధి యొక్కఁడే ఆ వైష్ణవుఁడు. నాకు రాజ్యమక్కఱలేదు. స్వర్గమక్కఱలేదు. పునర్జన్మ యక్కఱలేదు. దుఃఖవంతుల దుఃఖము నశింపవలెనని మాత్రమే కోరుచుందునని యతఁడు నిత్యము దేవదేవుని మ్రొక్కుకొనుచుండును. అందువలననే యాతని హృదయము ప్రేమామృతముతో నిండి తొలకుచుండును

తులసీదాసు రామచంద్రుని గురించి యిట్లు వ్రాసియున్నాడు.

" హృదయ, అనుగ్రహ, ఇందుప్రకాశా !
సూచత కిరణ మనోహర హాసా "

(హృదయములో అనుగ్రహమనెడు చంద్రకాంతి యున్నది. దానికిరణములు మందహాస రూపమున వెలికి వచ్చుచున్నవి.)

ఆ మహాత్ముని చిఱునవ్వు వెన్నెలలట్టివి. అవి యెందఱకును ఆహ్లాదనమును ప్రసాదించుంగాక!

ఓమ్ తత్ సత్

